
# అరిహంత్



రచన :

బ్రహ్మర్షి

తటవర్తి వీరరాఘవరావు

# అరిహాంత్



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు


మొదటి ముద్రణ : డిశంబరు, 2025

ప్రతులు : 2,000

వెల : రూ. 50/-



పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 16) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 17) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# మూడు రకాల శత్రువులు

అరిహంత్ అనే పదానికి పత్రి గారు ఇచ్చిన వివరణ ఇప్పుడు తెలుసుకుందాం. ఆయన ఏమన్నారంటే! అరి అంటే శత్రువు, హంత్ అంటే హతం చేసినవాడు. అరిహంత్ అంటే శత్రువును హతం చేసినవాడు అంటే అంతం చేసినవాడు. మానవుడికి ముగ్గురు శత్రువులు ఉన్నారు. ఎవరు అంటే తమోగుణం, రజోగుణం, సాత్విక గుణం.

ఈ తమో గుణం అన్నది అన్ని సందర్భాల్లోనూ మానవుడికి శత్రువే. శత్రువు అంటే నష్టం కలిగించేవాడు, ఇబ్బందులు పెట్టేవాడు. ఈ తమో గుణం అన్నది అన్ని సందర్భాల్లో ఇబ్బందులు పెడుతూనే ఉంటుంది. అంటే ఈ తమో గుణం ఉంటే ఎప్పుడూ నష్టపోతూనే ఉంటాడు.

రెండవ శత్రువు అయినటువంటి రజో గుణం అనేక సందర్భాల్లో ఇబ్బందులు కలిగిస్తుంది, నష్టం కలిగిస్తుంది.

మూడో శత్రువైనటువంటి సాత్విక గుణం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో నష్టం కలిగిస్తుంది, ఇబ్బందులు పెడతుంది.

## "తమోగుణం"

ఈ "తమోగుణం" అనే శత్రువు వల్ల అలసత్వం ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే బద్ధకం బాగా ఎక్కువ ఉంటుంది. ప్రతీ పని రేపటికి వాయిదా వేస్తూ ఉంటారు. ఈ గుణం ఎప్పుడూ ఉండకూడదు అంటే పనులు ఎప్పుడూ వాయిదా వేయకూడదు.

పత్రిగారు అందుకే **"రేపు చేయాలనుకున్న పనులు ఈ రోజే చెయ్యాలి. ఈరోజు చేయాలనుకున్న పనులు ఇప్పుడే చెయ్యాలి"** అంటారు.

అందుచేత మీరు చేయాలనుకున్న పనులు, చేయవలసిన పనులు ఎప్పుడూ వాయిదా వేయకూడదు. అందులోనూ ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి

వచ్చిన మీరు ఎదగాలి అంటే ఖచ్చితంగా ఈ శత్రువుని జయించాలి, ఈ అలసత్వాన్ని, బద్ధకాన్ని, ఈ వాయిదా వేయడాన్ని అధిగమించాలి.

ధ్యానం చేయడానికి కూడా చాలామంది రేపు చేద్దాంలే, ఎల్లుండి నుంచి చేద్దాంలే, ఆ పని అయిపోయాక చేద్దాంలే అని వాయిదా వేస్తూ ఉంటారు. ఎన్ని పనులు ఉన్నా ధ్యానం మట్టుకు వాయిదా వేయకూడదు.

అలాగే ఇంకా మీరు ఇప్పుడు జ్ఞానం పెంచుకోవడానికి ఎన్నో పనులు చేస్తున్నారు. పుస్తకాలు చదువుతున్నారు, అందరితో సాంగత్యం చేస్తున్నారు, వ్రాసుకుంటున్నారు, అర్థం కానివి మళ్లీ మళ్లీ వింటున్నారు. జ్ఞానం పెంచుకోవడానికి ఎన్నో పనులు చేస్తున్నారు. ఈ ఇవ్వబడిన సమయాన్ని వృథా చేయకూడదు. ఆ పనులు మానేసి కాలక్షేపం పనులు చేయకూడదు.

కొంతమంది బుక్స్ అనువాదం చేస్తున్నారు, వీడియోలు ఎడిట్ చేస్తున్నారు, కొంతమంది షార్ట్ వీడియోలు చేస్తున్నారు, టెక్స్ట్ కన్వర్షన్స్ చేస్తున్నారు. ఇలా రకరకాల పనులు చేస్తున్నారు, అవి ఎప్పుడూ వాయిదా వేయకూడదు. ఆ వాయిదా వేయడం అన్నది మీ దగ్గర లేకపోతే చాలా తొందరలో ఎంతో ఎదుగుతారు. ఎంతో జ్ఞానం సంపాదించుకుంటారు. తక్కువ సమయంలోనే ఎక్కువ ఎదగ గలుగుతారు.

అందరికీ ఎదగాలని ఉంటుంది, మంచి జ్ఞానం సంపాదించు కోవాలని ఉంటుంది, జ్ఞానం తెలియని వాళ్ళకి అందించాలని ఉంటుంది. కానీ ఈ తమోగుణం అనే శత్రువు వల్ల ఎదగలేకపోతూ ఉంటారు. అంతకన్నా వేరే కారణం ఏమీ లేదు.

అందుచేత తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఈ తమోగుణం అనే శత్రువుని జయించవలసిందే. అందుకే 'శుభశ్య శీఘ్రం" అన్నారు. ఏ పనైనా వెంటనే ప్రారంభించాలి. కారణం ఏమిటంటే! "ఆలస్యం అమృతం విషం" అని కూడా అన్నారు. ఆలస్యం అయ్యేకొద్దీ అమృతం కూడా విషంలా మారిపోతుందట.

అందుకే పత్రి గారు తమోగుణాన్ని పెంచే నిలవ ఉన్న ఆహారాలు తీసుకోకూడదు అంటారు. ఎప్పటికప్పుడు వండుకుని వేడి వేడిగా తినాలంటారు. అందుచేత ఈ తమోగుణం అన్నదాన్ని ఎప్పుడూ ఎల్లవేళలా అధిగమించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పత్రి గారు ఏమని చెప్పారంటే భీష్ముడు అంపశయ్య మీద ఉన్నప్పుడు కూడా శ్రీకృష్ణుడు భీష్ముడికి పని అప్పచెప్పాడట. ధర్మరాజుకి ధర్మ బోధ చేయమని, రాజనీతి సూత్రాలు చెప్పమని చెప్పాడట. ఇంక వెళ్లి పోయే ముందు నేనేం చేయను? ఏం చేయగలను? అనే పరిస్థితిలో కూడా మరి భీష్ముడికి శ్రీకృష్ణుల వారు పని అప్ప చెప్పాడంటే ఆలోచించండి! మనకి కొంచెం అస్వస్థత, అనారోగ్యం, కొంచెం అలసట ఉంటే వెంటనే చేసే పని ఆపేస్తాం, తగ్గాక చూసుకుందాం అని వాయిదా వేసుకుంటాం..

అందుచేత ఇది గుర్తుపెట్టుకోండి ఎవరి గొడవ మనకు అనవసరం. మనం ధ్యాన మార్గంలోకి, జ్ఞాన మార్గంలోకి రావడం జరిగింది. అందుచేత ఈ మార్గంలో తప్పనిసరిగా మనం ఎదగడానికి కృషి చేయాలి. దానికి అవరోధమైన ఈ మొదటి శత్రువైన తమో గుణాన్ని అధిగమించే ప్రయత్నం చేయాలి, ఊరికే అశ్రద్ధ చేయడం కాదు.

ఈ ఆధ్యాత్మిక మార్గంలో ఏ పని చేయడానికైనా అంటే ధ్యానం చేయడానికి కావచ్చు, పుస్తకాలు చదవడానికి కావచ్చు, లేకపోతే ఈ సందేశాలు వినడానికి కావచ్చు బద్ధకిస్తున్నారు అంటే మీలో తమోగుణం ఉన్నట్టే. ఏదైనా సేవల్లో పాల్గొనాలంటే వాళ్ళు చేస్తున్నారు మనకెందుకు? అనుకుంటే అది కూడా తమోగుణ లక్షణమే. వాళ్ళెవరూ మనకి చెప్పలేదు. చెప్పనిదానికి మనకెందుకు అనుకుంటూ ఉంటారు. మీలో చాలామందికి చేయగలిగే అర్హత, సత్తా ఉంది, ఆ నైపుణ్యం ఉంది. కానీ నాకు ఎవరూ చెప్పలేదు అంటారు.

అలాగే మీలో చాలామందికి ఉన్న ఒక అభిప్రాయం ఏమిటంటే ఆ

పని నాకు తెలియదు, ఆ జూమ్ ఎలా ఓపెన్ చేయాలో నాకు తెలియదు అని మానేస్తూ ఉంటారు. లాప్టాప్ కొనుక్కోగలిగే కెపాసిటీ ఉండీ కొనరు. నాకు తెలీదు కదా అంటారు. అదీ ఒక రకంగా తమోగుణ లక్షణమే.

నీకు కొనే కెపాసిటీ ఉన్నప్పుడు కొని, ఏదో ఒక రకంగా ఎవరో ఒకరిని పట్టుకొని అది నేర్చుకొని సాధించాలి. వారిలాగే మీరూ తయారు కావాలి. అప్పుడు మీరు తమోగుణం అనే శత్రువుని జయించిన వారౌతారు. ఇంకా కొంతమందిని చూస్తే ఒకళ్ళు చెప్పక్కర్లేదు, ప్రతీ విషయం చెప్పకపోయినా నేర్చుకుంటారు, ఫాస్ట్ గా ఎదరికి వెళ్ళిపోతారు.

అలాంటి వారిని చూసి కొంతమంది ఏమనుకుంటారంటే వాళ్ళు బాగా తెలివైనోళ్ళు, బాగా చదువుకున్నారు అని సర్టిఫికెట్ ఇచ్చి, వీళ్ళు ఏమీ చేయకుండా కూర్చుంటారు. ఒకటే చెప్తున్నాను ఎవ్వరూ తక్కువ కాదు. అందరూ తెలివైన వాళ్లే, కావలసిందల్లా శ్రద్ధ. మీలో ఉన్న ఈ తమోగుణం అనే శత్రువు వల్ల చెయ్యలేకపోతున్నారు.

నాకు అది తెలియదని కూర్చుంటే ఎప్పటికీ తెలియదు. తెలిసున్న వాళ్ళని అడగాలి. ఏ టెక్నాలజీ గురించి అయినా సరే తెలియని వాళ్ళకి చెప్పడానికి తెలిసున్నవారు సంతోషంగా ముందుకు వస్తారు.

మనం ఒక విషయం ఇతరులకి నేర్పితే ప్రకృతి మనకి 10 విషయాలు నేర్చుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ రహస్యం మర్చిపోకండి. పంచితేనే పెంచబడుతుంది. ఇస్తేనే వస్తుంది. ఇవ్వడానికి వెనకాడొద్దు. అడగకపోతే మీరేమీ చేయలేరు. కానీ అడిగినప్పుడు ఇవ్వడానికి అది అదృష్టంగా భావించాలి.

మనం ఈ సృష్టి రహస్యం తెలుసుకున్నాం. సత్యాన్ని బోధించాలి, చేయలేకపోతున్నాము అంటే! తమోగుణం అనే శత్రువు వల్లే. అలసత్వం అంటే ధ్యానం చేయడానికి బద్ధకం, వాయుదాలు వేయాలనుకోవడం ఇవన్నీ కూడా తమోగుణం యొక్క లక్షణాలు.

# మొదటి శత్రువు ‘తమోగుణం’

ఈ జన్మలో ఎంతో ఎదగ గలిగే అవకాశం ఉండి కూడా ఈ లక్షణాలతో ఈ శత్రువు వల్ల ఎదగలేకపోతున్నారు. చెయ్యగలిగి కూడా చేయలేకపోతున్నారు. చెప్పగలిగీ చెప్పలేకపోతున్నారు. నా బ్రతుకు ఇంతే! ఇంక అంతకన్నా నేనేమి చేయలేను, నా వల్ల ఎక్కడ అవుతుంది? అనే అభిప్రాయాల నుంచి బయట పడండి.

మీరు ఎంత కృషి చేసి ఆ లక్షణాలు తగ్గించుకుంటే మీకు అన్ని జన్మలు తగ్గిపోతాయి. ఇప్పుడు నేను మీ అందరికీ ఎందుకు చెప్తున్నానంటే ప్రారంభ జన్మలో ఉన్నవాళ్ళు అంటే 100, 150, 200 జన్మల్లో ఉన్నవాళ్ళు అలా ప్రవర్తిస్తే ప్రవర్తించొచ్చు. కానీ మీరందరూ కూడా 350 జన్మలు దాటి ఉన్నవాళ్లే, మీరు ఈ లక్షణాన్ని సమూలంగా తొలగించుకోవాలి.

తమోగుణాన్ని ఒక శత్రువుగా భావించండి. బద్ధకం, అలసత్వం, రేపటికి వాయిదా వేయడం అన్నది మీ జీవితంలో ఉండకూడదు. ఈరోజే, ఇప్పుడే మీరు ఆచరించే ప్రయత్నం చేయండి. ఈ జన్మలోనే మీరు మిరకల్స్ చేస్తారు, దూసుకుపోతారు, అందరికీ ఆదర్శవంతులు అవుతారు, ఎన్నో జన్మలు తగ్గించేసుకుంటారు, మీలో ఎన్నో రకాల మార్పులు చాలా తొందరగా తెచ్చుకుంటారు.

మరి ఈ తమోగుణం అనే శత్రువు మీలోంచి తొలగిపోవాలి అంటే ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానాన్ని తీవ్రాతి తీవ్రంగా కొన్నాళ్ళు చెయ్యాలి. లైఫ్ లాంగ్ అక్కర్లేదు. కొన్నాళ్ళు మీరు భీమవరం మానకుండా వచ్చి అక్కడ ఎంత వీలయితే అంత ధ్యానం చేయండి.

మీ ఇంటికి వెళ్ళాక కూడా అలా కొనసాగించే ప్రయత్నం చేయండి, ఆహార నియమాలు కఠినంగా పాటించండి. ఈ రెండు పనులూ మీరు చేసినట్లయితే ఈ తమోగుణం అనే శత్రువుని జయించడం కష్టమేమీ కాదు.

# రెండవ శత్రువు "రజోగుణం"

ఈ రజో గుణంలో శక్తివంతంగా అనేకానేక పనులు చేస్తారు. ఇది చాలా మంచిదే కానీ అన్ని పరిస్థితుల్లోనూ కాదు. రజోగుణం అంటే ఉద్రేకాన్ని కలిగించేది. అలా ఉద్రేకానికి లోనై శక్తికి మించిన పనులు తలబెడుతూ ఉంటారు. పత్రి గారు అలాంటి పనులు తలపెట్టకూడదు అంటారు.

రజో గుణం అనగానే మీరు రావణాసురుడిని గుర్తు తెచ్చుకోవాలి. అప్పుడు రజోగుణ లక్షణాలు ఎలా ఉంటాయి అన్నది మీకు బాగా అర్థమవుతుంది.

ఆయన ఏం చేశాడు? కైలాస పర్వతాన్ని ఎత్తాలని చూశాడు. ఆవేశంతో, ఉద్రేకంతో, వెనకా ముందూ ఆలోచించకుండా శక్తికి మించిన పని తలపెట్టాడు భంగపడ్డాడు. ఒక రకంగా చెప్పాలంటే గర్వభంగం అయింది.

అలాగే మన సొసైటీలో కూడా చాలామంది ఆవేశపడి పిరమిడ్లు కట్టడం మొదలుపెడతారు. పిరమిడ్ కట్టడం మంచిదే కానీ అది కట్టడానికి నాకు ఆ స్తోమత ఉందా? లేదా? అది చూడరు ఆలోచించరు.

కొంతమంది 10/10 పిరమిడ్ కట్టే స్థాయి ఉంటే 50/50 లేదా 100/100 పిరమిడ్ కట్టడానికి ప్రయత్నిస్తారు. వారు పునాది వేసి ఆగిపోతారు. చందాలు ఇమ్మని వాళ్ళ చుట్టూ, వీళ్ళ చుట్టూ తిరుగుతూ బ్రతిమాలతారు. చివరికి విఫలం చెంది ఎంతో బాధపడతారు. అందుచేతే పత్రి గారు శక్తికి మించిన పనులు ఎప్పుడూ చేయకూడదు, మన శక్తికి తగ్గ పనులే చేయాలి అని చెప్పారు.

ఇంకా కొంతమందికి వాళ్ళకి ఉన్న భూమిలోంచి ఏదో కొంత భూమి ఇస్తారు. అది ఎక్కడో ఊరికి అవతల ఉంటుంది. స్థలం వచ్చేసింది, 10 మందినీ అడిగితే డబ్బు ఇస్తారు అంటూ పెద్దదే మొదలు పెడతారు. ఆ పిరమిడ్ కట్టాలి అంటే ఎంత కావాలి? ఎంత డబ్బు అవసరం? అన్నది

ఆలోచించరు.

ఇవన్నీ చేస్తూ జ్ఞానాన్ని పొందే ప్రయత్నం మానేస్తారు. జీవితమంతా అది కట్టడానికే అంకితం అయిపోతారు, చివరికు ఉభయ భ్రష్టత్వం పొందుతారు. అటు అదీ పూర్తి చేయలేరు, ఇటు ధ్యానం చేసి జ్ఞానమూ పొందరు.

అందుకే పత్రి గారు అంటారు ఉద్రేకాలకు లోనై శక్తికి మించిన పనులు ఎప్పుడూ చేపట్టరాదు అని. ఏదైనా మీరు ఒక పని చేయాలనుకున్నప్పుడు మీ శక్తిని అంచనా వేసుకోండి. అది నేను పూర్తి చేయగలను అన్నప్పుడే మొదలు పెట్టండి. ఇంకా కొంతమంది ఇటువంటి పనులు స్వార్థంతో మొదలు పెడతారు. ఆ వంకన డబ్బు వసూలు చేసి తమ పోషణ చూసుకుంటారు. ఇది వాడి భవిష్యత్తుని ఎంతో నాశనం చేస్తుంది, ఈ విషయం వాడికి తెలియదు.

దేని కోసమైనా చందా వసూలు చేశాం అంటే అది దానికే ఖర్చు పెట్టాలి కానీ మీ సొంత ఖర్చుల కోసం ఆ వంక పెట్టి వసూలు చేయడం అన్నది సృష్టి విరుద్ధం. అలాంటివారు తర్వాత ఎంతో ఘోరంగా నష్టపోతారు, పతనం చెందుతారు. ఇలాంటి పనులు చేసేవాళ్ళు కూడా చాలామంది ఉన్నారు. ఇదంతా రజోగుణ లక్షణం. శక్తి మేర చేయాలి కానీ శక్తి మించి చేయకూడదు. వాళ్ళకి సమర్థత ఉంది కానీ శక్తి మేరేకే దాన్ని ఉపయోగించాలి, శక్తికి మించి ఉపయోగించుకోకూడదు, ఎన్నో పెరమిడ్లు ఇలాగే ఆగిపోయాయి.

అందుకే విదురుడు “తన శక్తి సామర్థ్యాల గురించి ఆలోచించకుండా పగటి కలలు కనేవాడు మూర్ఖుడు” అన్నాడు.

మన సొసైటీలో ఇంకా ఎన్నో పనులు చేస్తున్నారు. నేను పత్రి గారి పేరుతో అది చేస్తున్నాను, ఇది చేస్తున్నాను అంటారు. అది పూర్తవ్వక ఎన్నో ఇబ్బందులు పడుతూ ఉంటారు. ఇలా శక్తికి మించిన పనులు చేయడం అన్నది రజోగుణ లక్షణం అందుచేత ఈ రజోగుణాన్ని కూడా శత్రువు అన్నారు,

కనుక ఈ రజోగుణాన్ని కూడా జయించాలి.

పత్రి గారు ఇంకా ఏం చెప్పారంటే? సత్యాసత్య విచారణ లేకుండా మాటలు పలకరాదు, ఇతరులకు బోధించరాదు అన్నారు. లేకపోతే వాడు రజోగుణం అనే శత్రువుకు బానిస అయినట్టే లెక్క. దాన్ని జయించనట్టే లెక్క. ఖచ్చితంగా వాడు ఎంతో నష్టపోతాడు.

అంతేకాదు పత్రి గారు సత్య, అసత్య విచారణ లేకుండా మాటలు పలక కూడదు అని చెప్పారు. ఉదాహరణకి పత్రిగారు 18 ఆగర్భ సూత్రాలలో విగ్రహారాధన వద్దు సత్యారాధన చేయాలన్నారు. ఎందుకు? విగ్రహారాధన వద్దు అన్నారు అంటే విగ్రహం అసత్యం కాబట్టి వద్దు అన్నారు, ఆత్మ సత్యం కాబట్టి, సత్యారాధన అంటే ఆత్మరాధన చేయమన్నారు. మరి ఆత్మను ఆశ్రయించాలి అంటే “ శ్వాస మీద ధ్యాస ధ్యానం ఒక్కటే మార్గం అందుచేత ఎవరైతే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చేస్తారో వారు సత్యాన్ని ఆశ్రయించినట్టు.

కానీ ఎవరైతే సంగీత ధ్యానం, గైడింగ్, గుడాకేశ, కర్మ విపాక, ఓంకారం ధ్యానం ఇలా రకరకాల ధ్యానాలు చెప్తున్నారో వారు అసత్యాన్ని ఆశ్రయించమని చెప్పేవాళ్ళు. ఎందుకంటే అటువంటి ధ్యానాల వల్ల మనసు దగ్గరే ఆగిపోతారు, విగ్రహం ఎలా అసత్యమో మనసు కూడా అసత్యమే.

అటువంటి అసత్యమైన మాటలు పలకకూడదు. అదే పత్రి గారు ఈ సందేశంలో చెప్పారు. ఇలా ఎందుకు చేస్తున్నారంటే? వ్యతిరేకము, ఆవేశము అన్నవి రజోగుణం లక్షణాలు.

అందరినీ నేను ఆకర్షించాలనే చూసుకుంటారు కానీ వాళ్ళకి ఆలోచన ఉండదు, విచారణ ఉండదు, చివరికి అది వాళ్ళకి అంతులేని నష్టాన్ని కలిగిస్తుంది అన్న సంగతి తెలీదు. తాత్కాలికంగా అజ్ఞానంలో ఉన్నవాళ్ళు ఆకర్షితులు అయితే అవ్వచ్చు. కానీ ఒక రకంగా వాళ్ళూ నష్టపోతారు, వీడూ

నష్టపోతాడు.

పత్రి గారు చాలాసార్లు చెప్పారు. నువ్వు ఇతరులకు లాభం కలిగించే పనులు చేస్తేనే, ఇతరులకు లాభం కలిగించే మాటలు చెప్తేనే నువ్వు లాభం పొందుతావు. ఎంత లాభం కలిగిస్తే నువ్వు అంత లాభం పొందుతావు. అలాగే ఇతరులకు నష్టం కలిగించే పనులు కానీ, మాటలు కానీ చేయించినా, చెప్పినా నువ్వు నష్టపోతావు.

నువ్వు ఏదో గొప్ప సేవ చేశాను, గొప్ప కార్యం చేశాను అనుకుంటావు, కాని అది నీకు నష్టం కలిగిస్తుంది. ఎంత ఎక్కువ మందికి నువ్వు అలా నష్టం కలిగిస్తే నువ్వు అంత ఎక్కువ నష్టపోతావు. మనసు అసత్యం, ఆత్మే సత్యం. ఆత్మ తప్ప అనాత్మలన్నీ అంటే ఆత్మ కానివన్నీ అసత్యాలే. విగ్రహాన్ని ఆశ్రయించడం కాదు ఆత్మను ఆశ్రయించండి. విగ్రహారాధన కాదు ఆత్మారాధన చేయండి అని పత్రి గారు చెప్పారు. ఆత్మ సత్యారాధనే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

హిమాలయాల్లో యోగులు ఎక్కడైనా మ్యూజిక్ పెట్టుకొని ధ్యానం చేశారా? ఈ ధ్యానం ఈరోజు వచ్చింది కాదు కదా? యుగ యుగాల నుంచి వేల, లక్షల సంవత్సరాల నుంచి ఉంది కదా? మరి ఎంతోమంది అరణ్యాల్లో, కొండ గుహల్లో చేస్తున్నారు. అక్కడ మ్యూజిక్ ఎక్కడ పెట్టుకున్నారు? బుద్ధుడు దగ్గర నుంచేగా పత్రి గారు ఈ "ఆనా పాన సతి" ధ్యానం తీసుకున్నది.

మరి మ్యూజిక్ పెట్టి పత్రిగారు ఎందుకు చేయిస్తున్నారు? అన్న కోణంలో ఆలోచించాలి. పత్రి గారు కూడా ఎక్కడా, ఏ పుస్తకంలో కూడా చెప్పలేదు. అదే నేను కూడా చెప్తున్నాను. ఏది ఏమైనా ఎవరైనా సరే చివరికి సత్యాన్ని పట్టుకోవాల్సిందే!

ముక్తి పొందాలన్నా, మోక్షం పొందాలన్నా సత్యాన్ని ఆశ్రయించ వలసిందే. దానికి ముందు సత్య, అసత్య విచారణ చేసుకోవాలి. అసలు అదేమీ

చేయకుండా అసత్యం చెబుతున్నారు. అసత్యం అపజయం అని స్పష్టంగా చెప్పారు పత్రిగారు.

అలాగే ఈ రజోగుణం ఎంత నష్టం కలిగిస్తుందో భగవద్గీతలో 14వ అధ్యాయంలో 12వ శ్లోకం చెప్పబడింది.

**శ్లో॥ లోభ: ప్రవృత్తి రారమ్భ: కర్మణా మశమః స్పృహ ।**
**రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ ॥ (భ.గీ.14-12)**

తా:- భరత వంశ శ్రేష్టుడగు ఓ అర్జునా! రజోగుణం అభివృద్ధి చెందినప్పుడు మానవునిలో, లోభత్వము, నిషిద్ధ కర్మలు చేయుట, మనశ్శాంతి లేకుండుట, ఆశ అన్నవి కలుగుతుంటాయి.

అందుకే పత్రి గారు ఏమన్నారంటే అన్ని విధాలా ఆలోచించకుండా పనులు చేయడానికి ఎగబడకూడదు అన్నారు.

అందుచేత పత్రి గారు రెండవ శత్రువు అయినటువంటి రజో గుణాన్ని కూడా జయించి తీరాలి అని చెప్పారు. దానికి భీమవరంలో జరిగే శిబిరంలో పాల్గొని "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేయడం, సాత్వికమైన శాకాహారం తీసుకోవడం.

## మూడవ శత్రువు "సాత్విక గుణం"

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సాత్విక గుణం కూడా శత్రువే. ఎందుకు అది శత్రువు అయింది? ఈ సాత్విక గుణం అంటే అనుక్షణం శుభం చేయడంలో జీవించడం అంటే మంచి చేస్తూ ఉంటారు.

పత్రి గారు ఇంకా ఏమన్నారంటే? సాత్విక గుణం అంటే సదా సర్వదా కళ్యాణ కార్యక్రమాల్లో అంటే మంచి చేసే కార్యక్రమాల్లో ఉండడం అన్నారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే? ఎక్కువగా మంచి కూడా చేయ కూడదు, అంటే ఎక్కువగా సహాయం కూడా చేయకూడదు అన్నారు.

ఎందుచేతనంటే ఎవరైనా సరే వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేటట్లు దోహదం చేయాలి అంటే ప్రయత్నించాలి. అందుచేత మరొకళ్ళ పనులు ఎప్పుడూ చేయకూడదు, ఇంకొకళ్ళ పనులు చేయడం మంచితనం కాదు, అది వెర్రితనం అన్నారు. మన సొంత పనులు మనమే చేసుకోవాలి, మిగతా వాళ్ళ పనులు వాళ్ళ చేతే చేయించాలి.

అంతేకాదు చాలామంది ఎవరైనా కష్టాల్లో ఉంటే సహాయం చేయాలని చూస్తారు, కొంచెం దానం చేస్తారు. చేస్తూ వాళ్ళకి ఏదో సహాయం చేశాను అనుకుంటారు, ఇది సాత్విక గుణ లక్షణం. కానీ పత్రి గారు ఏమంటారంటే? ఇటువంటి పుణ్య కర్మలు కూడా పనికి రావు అంటారు.

పాప కర్మలు ఎవరైనా వద్దంటారు, తప్పు అంటారు. ఇక్కడ పత్రి గారు పుణ్య కర్మలు కూడా వద్దు అంటున్నారు, వాటిని కూడా అధిగమించాలి అంటారు. పాపమూ వద్దు, పుణ్యమూ వద్దు అంటారు. చాలా మందికి ఇది అర్థం కాదు. మీరు అడగొచ్చు, లేనోడికి ఏదైనా మనం సాయం చేస్తే తప్పేంటండి? అని.

ఆలోచించండి అసలు వాడికి ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది? ప్రకృతి అలాంటి పరిస్థితి వాడికి ఎందుకు కల్పించింది? అన్న విషయం మీరు ఆలోచిస్తే మీకు అర్థమవుతుంది. వాడు గత జన్మల్లో కానీ, గతంలో కానీ చాలా గొప్పవాడే. కానీ కొన్ని పాపాలు చేయడం వల్ల చేయకూడని పనులు చేయడం వల్ల ఇలాంటి జీవితం తెచ్చుకున్నాడు.

మరి ఎందుకు చేశాడు? అంటే అప్పుడు పాఠం నేర్చుకోలేదు. ఆ పాఠం నేర్చుకోవడానికే ఈ జన్మ తీసుకున్నాడు. ప్రకృతి ఎందుకు అటువంటి జన్మ కలిగించింది? ఆ జన్మంతా అలా అనుభవించడం వల్ల వాడు ఆ అనుభవాలు పొందడం ద్వారా పాఠం నేర్చుకుంటాడు. ఆ జన్మలో ఆ పాఠం నేర్చుకున్నాక మరుజన్మలో అలాంటి ప్రవర్తన వాడికి ఉండదు. ఆ రకంగా

అలాంటి పరిస్థితి కల్పించి వాడు పాఠం నేర్చుకునే అవకాశం కల్పించింది ప్రకృతి.

మరి వాడికి నువ్వు సహాయం చేస్తే పాఠం ఎలా నేర్చుకుంటాడు? ఎప్పుడు వాడిలో మార్పు వస్తుంది? అందుచేత మనం ఎవరికీ చెడూ చేయకూడదు, మంచీ చేయకూడదు. పాపం చేయకూడదు, పుణ్యం చేయకూడదు. ఈ పుణ్యం చేయకూడదు అన్న దానికి ఇక్కడ రెండు రకాలు కారణాలు ఉంటాయి.

ఒకటి నువ్వు ఎవరికైతే మంచి చేద్దాం అనుకున్నావో, సాయం చేద్దాం అనుకున్నావో వాడికి అవగాహన అవ్వాలి, వాడు గ్రహించాలి. అందరూ బాగున్నారు నా పరిస్థితి ఇలా ఎందుకైంది? అని వాడు ఆలోచిస్తే నేను ఎప్పుడో ఏ జన్మలోనో ఏదో చేయకూడని పని చేశాను, ఎవరినో బాధించాను అందుకే నా పరిస్థితి ఇలా అయ్యింది అని వాడిలో అంతర్మథనం జరగాలి.

గుర్తుపెట్టుకోండి. అందరూ ఆత్మలే! ముష్టివాడైనా ఆత్మే, కోటీశ్వరుడైనా ఆత్మే, ఎవరూ తక్కువ కాదు. మరి వీడికి ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది? సృష్టి విరుద్ధమైన పనులు చేశాడు, అధర్మమైన పనులు చేశాడు. ఎందుకు చేశాడు? అది గ్రహించక! ఇప్పుడు అలాంటి జన్మ తీసుకోవడం వల్ల అది గ్రహిస్తాడు, గ్రహించి ఆ తప్పు మరు జన్మ నుంచి ఇంక చేయడు.

మరి ఆ రకమైన మార్పు రావాలి అంటే ప్రతి ఒక్కళ్ళూ సాయం చేస్తూ కూర్చుంటే వాడిలో రియలైజేషన్ ఎక్కడ వస్తుంది? మీరు ఇప్పుడు యూట్యూబ్‌లో చూస్తున్నారు. కొంతమంది ముష్టివాళ్ళ దగ్గర లక్షలు ఉన్నాయని, వారు అలా వదిలేసి చనిపోయినోళ్ళూ ఉన్నారని వింటున్నారు.

మరి అలా ఎవరికి వాళ్ళు సాయం చేస్తూ ఉంటే వాడికి రియలైజేషన్ ఎప్పుడు వస్తుంది? పని చేయడం మానేసి ఇదే బాగుంది అనుకుంటాడు, ఇదే పని చేసుకుంటాడు చేయగలిగినా కూడా చెయ్యడు.

ఇంక రెండవ కారణం ఏమిటంటే? మీరు ఇతరులకు అలా సహాయం చేస్తే అది ఒక పుణ్యకర్మ అవుతుంది, పుణ్యం కూడా మరొక జన్మకు దారితీస్తుంది. నువ్వు ప్రతి జన్మలో అలా పుణ్యాలు చేస్తూ కూర్చుంటే దాన్ని అనుభవించడానికి మళ్లీ జన్మ తీసుకుంటావు. అలా ఎన్ని జన్మలు పుణ్యం చేస్తూ జన్మలు తీసుకుంటూ ఉంటావు? మోక్షం అక్కర్లేదా? మరి నువ్వు పుణ్యం చేస్తూ కూర్చుంటే జనాలోకం ఎప్పుడు దాటతావు?

ఆత్మలైన ఎవరైనా సరే జనాలోకం పైన ఉన్నటువంటి ఉన్నతమైన లోకాలు చేరుకోవాల్సిందే! అందుకే పత్రి గారు పాపం వద్దు, పుణ్యం వద్దు, ముక్తి కర్మలు చెయ్యి, ఆత్మ కర్మలు చెయ్యి, ఆత్మకు లాభించే కర్మలు చెయ్యి అప్పుడే నువ్వు జనాలోకం దాటి వెళ్తావు చివరికి మోక్షాన్ని పొందుతావు అన్నారు.

ఇది నేను ఒకసారి పత్రిగారి దగ్గర మొదట్లోనే స్పష్టంగా గమనించాను. 2003 సమయంలో ఆయన భీమవరం వచ్చినప్పుడు ఆయనకు కార్లు లేవు. కార్లో తిప్పేవాళ్ళు కూడా పెద్ద ఉండేవారు కాదు. భీమవరం వస్తే మళ్ళీ ఆయన్ని విజయవాడ పంపడానికి రైలు ఎక్కించవలసి వచ్చింది.

నేను ఆయన్ని రైలు ఎక్కించడానికి స్టేషన్ కి వెళ్ళాను. ఆ రైలు వచ్చే ముందు కొంచెం వెయిట్ చేయవలసి వచ్చింది. ఇద్దరం స్టేషన్ లోనే బల్ల మీద కూర్చున్నాం. ఎవడో ముష్టివాడు వచ్చి అడుగుతున్నాడు. కానీ పత్రి గారు ఏమీ స్పందించలేదు. పత్రిగారు ఏం చేస్తారు! అని నేను గమనించాను, వాడు కాసేపు అడిగి వెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళిపోయాక పత్రిగారు వీడు ఎన్ని పాపాలు చేశాడో ఇలా అనుభవిస్తున్నాడు అన్నారు. అప్పుడు అర్థమైంది ఓహో! వాడి అనుభవాలు వాడు పొందాలి కాబట్టి ఆయన స్పందించలేదు అన్నది అర్థమైంది.

ఆయన ఏదైతే చెప్తూ ఉంటారో అది ఆచరణలో కూడా కనిపిస్తూ ఉంటుంది, ఆచరించనిది ఆయన చెప్పరు. అందుచేతే పుణ్యం కూడా

వద్దంటారాయన. పత్రి గారు చెప్పిన ఈ విషయమే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు కూడా చెప్పడం జరిగింది. పత్రి గారు కృష్ణ భగవానుడు స్థాయిలో ఉన్నటువంటి ఒక గొప్ప యోగీశ్వరుడు, ఆయన ఏం చెప్పాడో అదే ఈయనా చెప్పాడు, ఆయన ఏం చేయమన్నాడో అదే చేస్తూ ఉంటాడు. కృష్ణ భగవానుడు ఏమన్నాడంటే?

**శ్లో॥ యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి**
**శుభా శుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్సమే ప్రియః (భ.గీ.12 -17)**

తా: ఎవడు సంతోషింపడో! ద్వేషింపడో! శోకమును పొందడో! ఎవడు కోరడో! ఎవడు శుభా శుభములను వదిలినవాడో! (మంచి-చెడు, పుణ్యము - పాపము ) అట్టి భక్తుడు నాకు ఇష్టుడు.

ఇక్కడ తెలుసుకోవలసింది భగవంతునికి ఇష్టమైనట్టు ఎవరైతే ఉండగలుగుతారో, జీవించగలుగుతారో వాళ్ళు మోక్షాన్ని పొందినట్టే.

పత్రి గారు సాత్విక గుణం కూడా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో శత్రువుగా పరిగణించబడుతుంది అన్నారు. అందుకే శ్రీకృష్ణుల వారు శుభాశుభ పరిత్యాగి అన్నారు. అశుభ పరిత్యాగం అన్నది అందరికీ వెంటనే అర్థమవుతూ ఉంటుంది. కానీ శుభ పరిత్యాగం అంటే శుభాన్ని కూడా కొన్ని సందర్భాల్లో సంపూర్ణంగా వదలాలి. అందుచేత గుర్తుపెట్టుకోండి సాత్విక గుణం కూడా తప్పే. అంటే పుణ్యం కూడా మీకు నష్టం కలిగిస్తుంది, మీ జన్మలని పెంచుతుంది.

అందుచేత నువ్వు అరిహంత్ కావాలి, శత్రువులను జయించాలి. తమోగుణాన్ని, రజోగుణాన్ని, చివరికి సాత్విక గుణాన్ని కూడా హతం చేయాలి. ఇది భగవద్గీతలో

**శ్లో॥ త్రైగుణ్యా విషయా వేద నిస్త్రై గుణ్యో భవార్జున**
**నిర్ద్వన్ద్వో నిత్యసత్వస్థో నిర్యోగ క్షేమ ఆత్మవాన్. (భ. గీ. 2-45)**

తా:- ఓ అర్జునా వేదములు త్రిగుణాత్మకములగు సంసార

విషయాలను తెలుపుచున్నవి. నీవు త్రిగుణాలను వదిలిన వాడవుగాను, ద్వంధములు లేనివాడవుగాను, నిరంతరము శుద్ధసత్వమును ఆశ్రయించిన వాడవుగా, యోగక్షేమముల దృష్టి లేని వాడగుము, ఆత్మజ్ఞానివి కమ్ము.

ఇక్కడ కూడా ఆత్మజ్ఞాని కమ్ము అని కృష్ణుల వారు చెప్పారు. ఆత్మజ్ఞానం ఎంత గొప్పదో? ఎంత అవసరమో? చెప్పారు. ఆత్మజ్ఞాని అయితే తప్ప ముక్తి పొందలేరు, దుఃఖం నుంచి బయట పడలేరు.

అలాగే

**శ్లో॥ గుణానేతా నాతీత్య త్రీ న్దేహీ దేహోసముద్భవాన్**
**జన్మ మృత్యు జరా దుః ఖై ర్విముక్తో మృత మశ్నుతే (భ.గీ. 14-20)**

తా:- జీవుడు దేహోత్పత్తికి కారణ భూతములగు ఈ మూడు గుణములను దాటినచో పుట్టుక, చావు, ముసలితనం, దుఃఖములు అనే వాటిచేత లెస్సగా విడువబడిన వాడై, మోక్షమును పొందుచున్నాడు.

అందుకే ఈ మూడు గుణాలు అధిగమించాలని ఎంతో స్పష్టంగా చెప్పాడు.

మూడు గుణాలు అంటే తమోగుణం, రజోగుణం, సాత్విక గుణం అంటే సాత్వికగుణం కూడా దాటాలని చెప్పడం జరిగింది. మంచి పనులు చేయడం, పుణ్య కార్యాలు చేయడం కూడా వద్దు అని స్పష్టంగా చెప్పడం జరిగింది. ఏ గుణం ఉన్నా మళ్లీ దేహం కలుగుతుంది. తమోగుణం, రజో గుణం వదిలేసినా సాత్విక గుణం ఇంకా వదిలించుకోకపోతే దేహం వస్తూనే ఉంటుంది. అందుచేత దాన్ని కూడా వదిలేయమంటున్నాడు.

అందుచేత ఎవరైతే ఈ విధంగా మూడు శత్రువులను సంపూర్ణంగా జయిస్తారో వారే అరిహంత్ అని పత్రిగారు చెప్పడం జరిగింది.

# ఆశ్చర్యకరమైన విషయం

మనలో ఉన్నటువంటి  చెడులు అన్ని పూర్తిగా తొలగించుకోకపోతే జీవిత లక్ష్యం అయినటువంటి మోక్షాన్ని  పొందలేము, దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడలేము. అందుచేత  చెడు తొలగించుకోవడం అన్నది చాలా చాలా  ముఖ్యమైనది .

మానవుడు  ఏం చేస్తున్నాడంటే  తనకి ఇవ్వబడిన వాటిని  పూర్తిగా సద్వినియోగం చేయట్లేదు. దుర్వినియోగం  చేస్తున్నాడు. అలాగే నిర్వినియోగం కూడా చేస్తున్నాడు .

**సత్యసాయిబాబా ఏమని చెప్పారంటే!**

"God has given you time, skill, chance, fortune and idea".

భగవంతునిచే  మానవుడికి ఏం కావాలో అవన్నీ ఇవ్వబడ్డాయి. అంటే సమయం, నైపుణ్యం, గొప్పవి సాధించగలిగే అవకాశాలు, అదృష్టం, ఆలోచనలు  ఇవ్వబడ్డాయి. కానీ వాటిని దేనికోసం ఉపయోగించాలో దానికోసం ఉపయోగించ కుండా వృధా చేస్తున్నాడు, దుర్వినియోగం చేస్తున్నాడు, నష్టం కలిగించే పనులు చేస్తున్నారు.

ఇది నిజంగా కూడా ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. ఇంత గొప్ప విలువ కట్టలేనివి ఇస్తే మానవుడు వీటిని ఉపయోగించుకోకుండా, వీటిని సద్వినియోగం చేసుకోకుండా వృధా చేస్తున్నాడు, దుర్వినియోగం కూడా చేస్తున్నాడు. పైగా దేవుడు నాకేమిచ్చాడు  అని అంటారు, ఎంత విచిత్రం, ఎంత ఆశ్చర్యం! అంతేకాదు ఇంకా ఎన్నో ఆశ్చర్యకరమైన పనులు చేస్తున్నారు, ఆశ్చర్యం కొలిపేటట్టుగా మానవుడు ప్రవర్తిస్తున్నాడు.

# శరీరం విలువ తెలుసుకోవాలి

మానవుడికి ఇవ్వబడిన  శరీరం ఏ జీవరాశికీ లేదు. ఎందుచేతనంటే ఈ శరీరంతో సాధించలేనిది అంటూ, చేయలేనిది అంటూ ఏదీ లేదు. ఏదైనా చేయగలడు, ఏదైనా సాధించగలడు. అలా ఎంతోమంది మహాను భావులు, యోగులు  చేసి చూపించారు.

అటువంటి యోగులకి ఉన్న శరీరము మీకు ఉన్నటువంటి శరీరము రెండు ఒకటే, తేడా ఏమీ లేదు. ఒక రమణ మహర్షికి ఇవ్వబడినటువంటి శరీరము ఎలా ఉంటుందో  మీకు ఇవ్వబడినటువంటి  శరీరం  కూడా అదే విధంగా  ఉంటుంది. ఉన్న తేడా దాన్ని ఉపయోగించుకోవడంలోనే  ఉంది.

వాళ్ళు ఇవ్వబడిన శరీరాన్ని వ్యర్థం చేయలేదు, దుర్వినియోగం చేయలేదు. రమణమహర్షి ఆ శరీరాన్ని ఎంజాయ్మెంట్ కోసం, ఎంటర్టైన్మెంట్ కోసం  ఉపయోగించలేదు. అలా ఉపయోగించుకుని ఉంటే ఇవ్వబడినటువంటి శరీరాన్ని వ్యర్థం చేసినట్టే .

చాలామంది ఈ శరీరాన్ని సుఖపెట్టడం  కోసం, ఎంజాయ్మెంట్ కోసం, సంతోషపెట్టడం కోసం జీవహింస చేస్తున్నారు, మాంసభక్షణ చేస్తున్నారు, చేయకూడని పనులు చేస్తున్నారు. ఆ శరీరంతో తప్పులు, పాపాలు చేస్తున్నారు. మరి ఇవ్వబడినటువంటి శరీరంతో ఇలాంటి పనులు చేస్తే ఎంత నష్టం జరుగుతుంది? అది దుర్వినియోగం చేసినట్టే అవుతుంది.

మానవుడికి శరీరం ఉంది. కాబట్టి, దాని అవసరాలు తీర్చుకోవచ్చు, తప్పేమీ లేదు. కానీ వ్యర్థం చేయకూడదు, దుర్వినియోగం అసలే  చేయకూడదు.

మరి రమణమహర్షికి  చదువు రాదు. కానీ ఆ శరీరంతో ఆయన ధ్యానం చేయించాడు, ఏది చేయాలో  అదే చేయించాడు. ఆ శరీరంతో ధ్యానం చేయించడం వల్ల ఎవరూ సాధించినలేని అపారమైన జ్ఞానాన్ని సంపాదించాడు, ఎంతో  శక్తిని సంపాదించాడు, ప్రపంచంలోనే గొప్పవాడిగా  ఎదిగాడు.

ఆయన కోట్లు  సంపాదించలేదు, భోగాలు అనుభవించలేదు. ఇప్పటికి ఆయన లేకపోయినా ఆయన సందేశాలు, ఉపన్యాసాలు, మాటలు

విని ఎంతోమంది ఆదర్శంగా తీసుకుని అనుసరిస్తున్నారు. తిరువణ్ణామలైకి ఎన్ని వేలమంది, లక్షలమంది ఆయన లేకపోయినా ఆశ్రమాన్ని చూడడానికి వెళ్తున్నారు.

మరి అటువంటి శరీరం మనకి ఇవ్వబడింది. ఒక వివేకానందుడు, ఒక వేమన, ఒక పత్రి గారిలా మీరు కూడా గొప్పగా ఎదగొచ్చు, అంత గొప్ప వాళ్ళుగా అవ్వచ్చు. ఆ శరీరంతో చేసే తీవ్ర ధ్యానసాధన వలన అపారమైన జ్ఞానాన్ని వాళ్ళు సంపాదించుకున్నారు. మీరు కూడా సంపాదించుకోవచ్చు. అటువంటి జ్ఞానాగ్నిలో వాళ్ళు కర్మలన్నీ తగ్గించుకున్నారు. మీరు కూడా ఆ పని చెయ్యొచ్చు. జన్మజన్మలలో ప్రోగైన కర్మలను ఈ జన్మలో శరీరంతో చేసే సాధనతో పూర్తిగా దగ్ధం చేసుకోవచ్చు.

కర్మలు ఉంటే అనుభవించాలి కాబట్టి జన్మ తీసుకోవాల్సి వస్తుంది. అది పాపకర్మ అయినా, పుణ్యకర్మ అయినా సరే. కర్మే లేకపోతే ఇంక అనుభవించేది ఏముంటుంది? వారికి ఇంక జన్మ రాదు. మరి ఆ స్థితి రావాలంటే శరీరాన్ని ఉపయోగించుకుంటేనే వస్తుంది.

స్త్రీ శరీరమైనా సరే ధ్యానం చేయొచ్చు, జ్ఞానం సంపాదించుకోవచ్చు. పురుష శరీరమైనా సరే ధ్యానం చేయొచ్చు, జ్ఞానం సంపాదించుకోవచ్చు. మీరు కూడా గతంలో చేసిన కొన్ని కర్మల కారణంగా అనుభవాల కోసం ఎవరికి అనుకూలమైన శరీరాన్ని వారు తీసుకున్నారు.

అంతేకాదు ప్రతినెల భీమవరం రావడమే కాదు, ఎంతో సాధన చేస్తున్నారు.రమణమహర్షి చేసిన సాధననే చేస్తున్నారు. అక్కడ సౌకర్యాలు ఉన్నాయా? లేవా? ఇవేమీ చూడట్లేదు, పట్టించుకోవట్లేదు. ఈ శరీరంతో చేయవలసిన పనులు చేస్తున్నారు. ఈ శరీరంతో గొప్పగొప్ప వారు ఏమి సాధించారో అది సాధించడమే మీ ఆశయం అవ్వాలి.

పత్రి గారు "గొప్పవారు ఏమి చేశారో అది చేయడమే మీరు చేయవలసింది" అంటారు.

ఇంకొక సందర్భంలో పత్రిగారు ఏమన్నారంటే! ఒక మినిస్టర్ని

చూసి  నేను మినిస్టర్ని అయితే బాగుంటుంది అనుకుంటారు. ఒక కలెక్టర్ ని చూస్తే నేను కలెక్టర్ అయితే బాగుండును అనుకుంటారు. ఒక సినిమా యాక్టర్ ని చూసి నేను కూడా సినిమా యాక్టర్ అయితే బాగుండు అని అనుకుంటారు. గొప్ప  సంగీత విద్వాంసుడిని చూసి నేను కూడా అంత గొప్ప వాడిని అయితే బాగుండును అని అనుకుంటారు. ధనవంతుని చూసి నేను కూడా ధనం సంపాదిస్తే బాగుండును అని అనుకుంటారు. కానీ రమణమహర్షి లాగా, వివేకానందలాగ అయితే ఎంత బాగుంటుంది అని అనుకోరే అంటారు.

శాశ్వతమైన వాటిని సంపాదించుకునే గొప్ప  శరీరం ఉండి కూడా వాటికి ఉపయోగించడం లేదు . ఎంత తెలివి తక్కువ వాళ్ళు అంటారు ఆయన.  గొప్ప వాళ్ళు చేస్తున్న పని మనం చేస్తే ఖచ్చితంగా గొప్ప వాళ్ళం అవుతాం. ఒక టెండూల్కర్ అవ్వాలి అనుకుంటే  టెండూల్కర్  ఫోటోని  పెట్టి పూజిస్తే  అవ్వవు, టెండూల్కర్ లాగా బ్యాట్ పట్టుకుని  ప్రాక్టీస్ చేస్తే అవుతావు. గొప్ప వాళ్ళని చూసి వాళ్ళ  ఫోటోలు పెట్టుకుని ఆరాధించడం కాదు వాళ్లు ఏం చేశారో అది  చేయడానికి ప్రాముఖ్యం ఇవ్వాలి.

అందుచేత ఈ శరీరం విలువ  కట్టలేనిది అని తెలుసుకోవాలి. దీనిని ఉపయోగిస్తే ఏదైనా సాధించవచ్చు, ఎంతైనా సాధించవచ్చు. అంత గొప్ప శక్తి కలది ఈ శరీరం. కానీ ఈ శరీరాన్ని ఉపయోగించుకునే విధానంలోనే ఉంది అంతా.   శరీరాన్ని సుఖపెడితే  నీకేం వస్తుంది? నువ్వు శరీరం కాదు, నువ్వు ఆత్మవు. నీ కోసం ఈ శరీరాన్ని తీసుకున్నావు.

ఆత్మ అయిన నీ ఉన్నతి కోసం, ఆత్మ అయిన నీ లాభం కోసం, ఆత్మ  అయిన నీ ఎదుగుదల కోసం, ఆత్మ అయిన నువ్వు గొప్పస్థితి పొందడం కోసం, ఆత్మ అయిన నువ్వు ఉన్నత లోకాన్ని పొందడం కోసం, ఆత్మ అయిన నీ లక్ష్యసాధన కోసం, ఆత్మ అయిన నువ్వు నీ గమ్యం చేరడం కోసం, ఈ శరీరాన్ని తీసుకున్నావు. అంతేకానీ శరీరం నిన్ను తెచ్చుకోలేదు, నువ్వు ఈ శరీరాన్ని ఎంచుకున్నావు.  అటువంటి శరీరాన్ని ఉపయోగించకుండా నిర్లక్ష్యం చేస్తే ఆత్మహంతకుడివి అవుతావు.

# పూర్ణాత్మ చేసే మేలు

సాధారణంగా ఈ ధ్యాన మార్గంలోకి, జ్ఞాన మార్గంలోకి వచ్చినటువంటి మనందరికీ కొన్ని కష్టాలు, కొన్ని గొడవలు, ఇంకా కొంతమందికి ఆర్థిక ఇబ్బందులు కూడా వస్తాయి. కానీ కారణం అర్థం కాదు.

సాధారణంగా మన సొసైటీలో ధ్యానం చేస్తే అన్ని సమస్యలూ తొలిగిపోతాయి అనేటటువంటి బలమైన నమ్మకం ఉంది. దానికి కారణం మన వాళ్ళు నేను ధ్యానం చేశాను నాకు క్యాన్సర్ తగ్గిందని, ఒకళ్ళు నేను ధ్యానం చేశాను అనుకున్న పని అయిపోయిందని, ఒకళ్ళు నాకు ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని, ఒకళ్ళు నాకు ఎన్నో అనుభవాలు వచ్చాయ్యని చెప్తూ ఉంటే ఓహో! ధ్యానం చేస్తే అన్ని రకాల లాభాలూ వస్తాయన్నమాట అనేటటువంటి అభిప్రాయం చాలామందిలో ఏర్పడుతుంది.

ఇక్కడ ఒక్కొక్కరికి ఒక్కొక్క రకం రావచ్చు కానీ అన్నీ ఒకరికే రావు, కొంతమందికి అసలు ఏమీ రావు. అలా రానప్పుడు ఎందుకు నేను ఇన్నాళ్ళ నుంచి చేస్తున్నా నాకేమి ప్రయోజనం కలగలేదు? ఏ లాభం రాలేదు? ఎందుకు నేను ధ్యానం చేయడం? అనేటటువంటి సందేహం కూడా వస్తుంది. చూసి చూసి కొన్నాళ్ళు పోయాక ధ్యానాన్ని వదిలేస్తారు. వాళ్ళ ఆలోచన అంతే! అంతకుముందు ధ్యానం చేయక పోయినా సమస్య వచ్చింది. ఎందుకు వచ్చింది? అది ఆలోచించరు. నేను ధ్యానం చేశాను పోలేదు అన్నదే వాళ్ళ ఉద్దేశం. అందుచేత ఈ సందేహం నివృత్తి చేసుకోవడానికి ఒక ఉపమానం చెప్పుకుందాం..

పత్రి గారు ఏం చెప్పారంటే "పూర్ణాత్మ నుంచి విడుదలైనటువంటి అంశాత్మలకు ఆ పూర్ణాత్మ ఒక లక్ష్యాన్ని నిర్దేశించి తల్లి గర్భంలో తయారయ్యే ఒక శరీరంలో ప్రవేశపెడుతుంది. నువ్వు ఎన్ని జన్మలైనా తీసుకో చివరికి నా

స్థాయికి రావాలి, అంటే నువ్వు కూడా పూర్ణాత్మ కావాలి, అప్పటిదాకా జన్మలు తీసుకుంటూనే ఉంటావు అని జనన మరణ చక్రంలో ప్రవేశపెడుతుంది". అంటే పుడుతూ ఉంటాడు, చస్తూ ఉంటాడు, ఎప్పటిదాకా? వీడు పూర్ణాత్మ అయ్యేదాక. అలా అయ్యేదాక అంశాత్మ బాగోగులు పూర్ణాత్మ చూసుకుంటుంది అని చెప్పారు.

ఇంకొకటి ఏమన్నారంటే? ఈ అంశాత్మల్ని పూర్ణాత్మలు అలా వర్షంలా సృష్టిస్తూనే ఉంటాయట. వర్షంలో ఎన్ని చినుకులు పడతాయో అలా ఎన్నో కోటాను కోట్ల అంశాత్మలు సృష్టింపబడతాయి. మానవులే కాదు 84 లక్షల రకాల జీవరాశులు అన్నీ పురోగతి సాధించవలసినవే అన్నారు. నా సందేహం ఏమిటంటే? ఇన్ని కోటాను కోట్లు సృష్టించి, ఇంతమంది బాగోగులు పూర్ణాత్మ ఒక్కటే ఎలా చూసుకోగలదు? అన్నదే.

మనం మన సంసారంలో ఉన్న ఇద్దరు, ముగ్గురు బాగోగులే చూడలేక చస్తున్నామే! పూర్ణాత్మ ఇంతమంది బాగోగులు ఎలా చూసుకుంటుంది? అన్న సందేహం కూడా నాకు వచ్చింది. అంతేకాదు ఆ పూర్ణాత్మ అంటే భగవంతుడే మన బాగోగులు, మన మంచి చెడ్డలు అన్నీ చూసుకుంటున్నప్పుడు మనందరికీ ఇన్ని కష్టాలు, ఇన్ని సమస్యలు, ఇన్ని బాధలు, ఆర్థిక ఇబ్బందులు, గొడవలు ఎందుకు వస్తున్నాయి? అనే సందేహం కూడా వచ్చింది.

అంతేకాదు ఏది జరిగినా మన మంచికే అంటారు కదా? మరి కష్టం వస్తే అది మనకి మంచి ఎలా అవుతుంది? అనే సందేహం కూడా వచ్చింది. ఈ సందేహాలన్నిటికీ ఇప్పుడు చెప్పే ఈ ఉపమానం ద్వారా మనకు స్పష్టమైన సమాధానం వస్తుంది.

"భగవంతుడు అంటే పూర్ణాత్మ భక్తులకు అంటే ధ్యానులకు చేసే మేలు తెలియదు"

భక్తితో ఆరాధన చేసేవారికి భగవంతుడే దైవం, మోక్షం కోసం

ధ్యానం చేసేవారికి పూర్ణాత్మే దైవం. పూర్ణాత్మ ప్రేమ స్వరూపుడు, ధ్యాన వత్సలుడు అనుగ్రహించడానికే ఉన్నాడాయన.

ఉదాహరణకు ఒక చిన్న పిల్లవాడు పాకే స్థాయి దాటి ఇంచక్కగా కూర్చుని ఆడుకుంటున్నాడు. ఇంతలో భయంకరమైన నాగుపాము పడగ విప్పి, మెల్లిగా ఈ పిల్లవాడికి ఎదురు వస్తూ ఉంది. ఆ పిల్లవాడు పామును ఎప్పుడూ చూడలేదు. అదేంటో తెలియదు. ఆ వయసులో పిల్లల యొక్క లక్షణం ఏమిటంటే? ఏది కనిపిస్తే దాన్ని పట్టుకొని ఆడుకుంటారు. ఇక్కడ ఈ పిల్లవాడికి ఆ కొత్తగా వచ్చినటువంటి ఆ కాలనాగు వాడి మృత్యు స్వరూపం అని తెలియక ఆట వస్తువు అని భావించి ఆడుకుందాం అనుకున్నాడు.

అది వస్తూ ఉంటే పారిపోకుండా కేరింతలు కొడుతూ పాముకు ఎదురు వెళ్తున్నాడు. ఇది పిల్లవాడి అమ్మ చూసింది, ఆవిడ భయకంపితురాలై గజగజ వణికిపోయింది. పరుగు పరుగున వెళ్లి ఆ పిల్లవాడిని ఎత్తుకొని బయటకి తీసుకొచ్చేసింది.

ఆ పిల్లవాడు కొత్త బొమ్మ దొరికింది, దాన్ని పట్టుకొని ఆడుకుందాం అని ఎంతో ఆసక్తిగా వెళ్తుంటే వాళ్ళ అమ్మ వాడి కోరిక తీరకుండా, సరదా తీరకుండా వాడిని పట్టుకొని ఇవతలకి లాక్కొచ్చింది. అప్పుడు ఆ చిన్న పిల్లవాడు తల్లిని విరోధిగా భావించాడు, ఏమి చేయలేక గుక్క పెట్టి ఏడ్చాడు.

మూడు పూట్లా పాలిచ్చి వాడి ఆకలి తీరుస్తున్నటువంటి తల్లి ఇప్పుడు వాడికి శత్రువు అయిపోయింది. అక్కడ పరిస్థితి వాడికేం అర్థం కాలేదు, గర్భంలో ప్రవేశించినప్పటి నుంచి ఆ తల్లి ఎంతో ప్రేమగా చూస్తేనే కదా వాడు ఆ స్థాయికి ఎదిగాడు. అవి వాడికి అనవసరం, సరదా పడి ఆడుకుందామంటే ఆ వస్తువు దక్కనివ్వలేదు, ఆ కోపంతో గుక్క పెట్టి ఏడుస్తున్నాడు.

అలాగే ధ్యానులు విష సర్పాల లాంటి కోరికలు కోరుకుని వాటి

కోసం ప్రయత్నిస్తూ ఉంటే సమస్తమూ తెలిసున్నటువంటి, సర్వమయుడైన పూర్ణాత్మ ఈ ధ్యానుల కోరికలు విఫలం కావిస్తున్నాడు. కోరికలు అంటే విషసర్పాలు లాంటివి, ఈ ధ్యానులు కోరికలు తీరకపోతే మేము ఇంత కష్టపడి ధ్యానం చేస్తుంటే మేము అనుకున్నవి జరగలేదని, సంకల్పాలు పెట్టినా అవ్వలేదని చాలా బాధపడుతూ ధ్యానాన్ని సైతం మానేస్తారు.

ధ్యానం ఎందుకు చేస్తున్నారు? ఆ పూర్ణాత్మను చేరుకోవడానికి, ఆ సత్యలోకం చేరుకోవడానికి, అసలు వాడి లక్ష్యమే అది. కోరికలు తీర్చుకోవడం కోసం భూమి మీదకి రాలేదు. పోనీ ఈ కోరికలకు అంతం ఉందా అంటే? ఒకటి తీరిపోతే ఇంకొకటి! అది తీరిపోతే ఇంకొకటి! పుడుతూనే ఉంటాయి. ఆ కోరికల కోసం ఇంకా పతనం అవుతాడు.

అందుచేత ఈ ధ్యానం చేసే వాళ్ళకి కోరికలు తీరకపోతే ధ్యానమే మానేస్తారు. ఎంతో బాధపడతారు! పిల్లవాడికి పాము దక్కలేదని తల్లి మీద కోపంతో గుక్క పెట్టి ఎలా ఏడ్చాడో, అలాగే ఈ ధ్యానులు తమ కోరిక నెర వేరలేదని పూర్ణాత్మ మీదా, పరబ్రహ్మ మీద ఉంచిన దృష్టిని మరలుస్తారు. ఎన్నో జన్మల పుణ్యఫలం వల్ల వచ్చిన అవకాశాన్ని మానేసి ఇంకొకటి ఏదో చేసుకుంటారు.

ఎంత విచిత్రం చూడండి! ఇప్పుడు ఆ తల్లి పిల్లవాడికి మంచి చేసిందా? చెడ్డ చేసిందా? ఆలోచిస్తే మీకే తెలుస్తుంది. అలాగే పూర్ణాత్మను చేరుకోవడానికి అడ్డు వచ్చే విష సర్పాలు లాంటి మీ కోరికలు నెరవేరలేదంటే పూర్ణాత్మ మీకు మేలు చేసినట్టా? చెడ్డ చేసినట్టా? బాగా ఆలోచించండి.

భగవద్గీతలో కానీ, మేడం కానీ, నేను కానీ ఎప్పుడూ ఒకటే చెప్తున్నాం. కోరికలకు బానిస కాకండి, కోరికల వ్యామోహంలో పడకండి, ఏ జన్మలో చేసుకున్న పుణ్యం వల్లో ఆ పూర్ణాత్మను, ఆ పరబ్రహ్మను, చేరుకునే సాధనలోకి వచ్చారు. పత్రి గారి దయ వల్ల "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యానమార్గాన్ని

తెలుసుకున్నారు, దీన్ని వదులుకోకండి అని చెప్తున్నాము.

మనం కష్టాలు పడకూడదనే పూర్ణాత్మ ఇలా ఉపకారం చేసింది కాని ఇది అపకారం కాదు. అందుకే అక్కర్లేని కోరికలతో మీ జీవితాన్ని వ్యర్థం చేసుకోకండి. భీమవరం మానేసిన వాళ్ళు, జూమ్ మానేసిన వాళ్ళు ఎంత నష్టపోతున్నారో వాళ్ళకు అర్థం కావట్లేదు.

ఆ తల్లి బాబుని వెనక్కి తీయకుండా వాడి కోరిక తీరడానికి వదిలేస్తే, వాడికి ఎంత ప్రమాదం జరిగి ఉండేదో! అలాగే అవసరం లేని కోరికలతో ఉన్న మానవులకు పూర్ణాత్మ కోరికలు తీరిస్తే, అంతే నష్టపోతారు.

అందుచేత ఒక్కటే గుర్తుపెట్టుకోండి. “ఏది జరిగినా మన మంచికే!” ఇది మీకు తర్వాత తెలుస్తుంది. నాకు పత్రి గారి పరిచయం అయినటువంటి సమయంలో ఎన్నో దెబ్బలు తగిలాయి. వ్యాపారంలో నష్టాలు, కుటుంబంలో గొడవలు, రాజకీయంగా దెబ్బలు. ఏమిటి? నా బ్రతుకు ఇలా అయిపోయింది అనుకున్నాను. దేవుడు ఇలా చేశాడు ఏమిటి? అనుకున్నాను. నేను వెంకటేశ్వర స్వామి భక్తుడిని, మందిరం కూడా కట్టాను. ఏమిటి ఇలా కష్టాలు పెడుతున్నాడు! అనుకున్నాను.

ప్రమాదంలో పడే ఆ ధనసంపాదనా మార్గంలో నుంచి భగవంతుడు నన్ను తప్పించి ఈ జ్ఞాన సంపాదనా మార్గంలోకి తీసుకురావడం జరిగింది.

ఈ మార్గంలో ఒక 10 ఏళ్ళు ఇబ్బందులు పడ్డాను. ఎందుకో తెలీదు ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఈ జ్ఞాన మార్గాన్ని వదలలేదు. నాతో పాటు మేడం కూడా చేతులు కలిపింది, పరిస్థితిని అర్థం చేసుకుంది.

కొంతమంది అడుగుతారు! ఇన్ని కోట్ల ఆస్తి ఉన్నప్పుడు ఎందుకు మీరు ఇంతలా ఆర్థిక ఇబ్బందులు పడడం, ఏవో అమ్ముకోవచ్చు కదా? అని, నాకు ఆ ఆలోచనే రాలేదు. ఎన్ని ఇబ్బందులు పడినా ఉన్న దాని తోటే సరిపెట్టుకొని పదేళ్ళు అలా గడిపాను. అప్పుడు పరిస్థితులన్నీ మారాయి,

పూర్ణాత్మకి ఇప్పుడు మనం వీడికి ఆర్థిక స్థితి కలిగించినా వీడు ప్రక్కదారి పట్టడు, ధనాన్ని దుర్వినియోగం చెయ్యడు, ఈ మార్గాన్ని వదలడు అనే విశ్వాసం కలిగిందో! ఏమో! అప్పటినుంచి పరిస్థితులన్నీ అనుకూలించాయి.

అందుచేత గుర్తుపెట్టుకోండి. "ఏది జరిగినా మన మంచికే!" పూర్ణాత్మ మన బాగోగులు ఎప్పుడూ చూసుకుంటూనే ఉంటుంది. మీరు అనుకున్నది జరిగినా, జరగకపోయినా అది మీకు అనవసరం. పూర్ణాత్మ రక్షణలోనే మీరు ఉన్నారు అన్నది మర్చిపోకండి. ఎన్ని కోట్ల ఆత్మలను సృష్టిస్తే అన్ని కోట్ల ఆత్మలని చూసుకుంటుంది. మీరు చేయవలసిందల్లా ఆయన మీద దృష్టి పెట్టడమే.

భగవద్గీతలో ఉంది కదా!

**శ్లో॥ అనన్యాశ్చింతయన్తోమాం యే జనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ (భ.గీ. 9-22)**

తా:-ఎవరైతే ఇతర చింతలు లేకుండా నన్నే నమ్ముకుని నన్నే ధ్యానిస్తూ ఎల్లప్పుడూ నా యందే నిష్ఠ కలవారి యొక్క యోగక్షేమాలను నేనే చూసుకుంటాను.

కోరికలు తీరలేదు, కష్టాలు వచ్చాయి అంటారు. మీరు అసలు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? దేని కోసం వచ్చారు? మీ లక్ష్యం ఏమిటి? మీరు చేయవలసిన పనులేమిటి? అవి తెలుసుకోరు. మీరు పిల్లల కోసం, తల్లిదండ్రుల కోసం, ఎంజాయ్ చేయడానికి రాలేదు అర్థం చేసుకోండి.

మీరు చేయవలసింది చేస్తూ ఉంటే, రావాల్సింది అదే వస్తుంది ఇదే సృష్టిలో ఉన్న సిద్ధాంతం అందుచేత ఆ భగవంతుడు మీద అంటే ఆత్మ మీద దృష్టి ఉంచండి. అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయండి.

# ఉపమాన సందేశం

"విద్యుత్ శక్తి వల్ల బల్బు వెలుగుతుంది, రైలు ప్రయాణం చేస్తూ ఉంటుంది, యంత్రాలు నడుస్తూ ఉంటాయి, ఇంట్లో ఎన్నో పరికరాలు పని చేస్తూ ఉంటాయి, ఎన్నో ఇండస్ట్రీలు పనిచేస్తూ ఉంటాయి. ఇవన్నీ విద్యుత్ శక్తి వల్లే పని చేయగలుగుతాయి కానీ విద్యుత్ శక్తి ఈ కార్యాలు ఏమీ చేయాలని అనుకోదు. ఆ శక్తి వల్ల ఆ పనులన్నీ జరుగుతున్నాయి, మానవుడు ఆ శక్తిని ఉపయోగించుకుంటున్నాడు అంతే."

అంటే చూడండి స్విచ్ వేస్తేనే ఏదైనా పని చేస్తుంది, స్విచ్ ఆపేస్తే ఏదీ పనిచేయదు. ఈ స్విచ్ ఆపడము, వేయడము ఎవరు చేస్తున్నారు? మానవుడే చేస్తున్నాడు. ఆ శక్తి ఏమీ చెప్పాలని గాని, చేయాలని గాని అనుకోదు.

అలాగే "ఆత్మ శక్తి వల్ల మానవుని మనసు, బుద్ధి, ఇంద్రియాలు అన్నీ పనిచేస్తున్నాయి. జడమైన శరీరం కూడా ఆత్మ శక్తి చేత నడపబడుతూ ఉంది.

జడము అని శరీరాన్ని ఎందుకు అన్నారంటే? శరీరం నుంచి ఆత్మ తప్పుకుంటే ఆ శరీరం ఏం చేయలేదు దాన్ని శవము అంటారు, అలా పడి ఉంటుంది. అంటే ఆత్మ శక్తి వల్లే ఆ శరీరం పనిచేస్తుంది, అంతేకానీ ఆత్మ ఈ కార్యాలు ఏవీ చేయాలని అనుకోదు, అది ఆత్మకు సంబంధం లేదు. మనసే ఆత్మశక్తిని ఉపయోగించుకొని ఆ పనులన్నీ చేస్తుంది".

దీని గురించి కొంచెం వివరించు కుందాం. మనం గమనిస్తూనే ఉన్నాం, విద్యుచ్ఛక్తి వల్ల ప్రపంచంలో ఎన్నో పనిచేస్తున్నాయి. ఆఫీసుల్లో, గృహాల్లో, బయట అలా ఎక్కడ చూసినా అన్నీ విద్యుచ్ఛక్తి వల్లే పనిచేస్తున్నాయి. ఆ విద్యుత్ ఆగిపోతే అవన్నీ ఆగిపోతాయి, జడం అయిపోతాయి. ఏమీ చేయలేని దానిలా అయిపోతాయి.

కానీ ఆ విద్యుచ్ఛక్తి ఇవన్నీ చేయాలనేమీ అనుకోదు. మానవుడు స్విచ్ వేస్తే అవి పని చేస్తాయి, ఆపేస్తే ఆగిపోతాయి. ఈ పని ఎవరు చేస్తున్నారు? మానవుడే! అలాగే ఆత్మ శక్తి వల్లే ఈ మనసు గానీ, బుద్ధి కానీ, ఇంద్రియాలు కానీ, శరీరం కానీ ఇవన్నీ పనులు చేస్తున్నాయి. ఈ పనులన్నీ చేయాలని ఆత్మ అనుకోదు.

అంటే ఇది ఆత్మకు సంబంధం లేదు. మనసు ఏం చేస్తుందంటే! ఈ ఆత్మ శక్తిని ఉపయోగించుకొని వీటితో ఆ పనులన్నీ చేయిస్తుంది. అందుచేత ఆత్మ శక్తితో ఇవన్నీ పని చేస్తున్నా ఆత్మకు ఈ పనులతో సంబంధం లేదు. మనసు ఆ శరీరంతో, ఆ ఇంద్రియాలతో తప్పులు చేయిస్తుంది, పాపాలు చేయిస్తుంది, అధర్మమైన పనులు, ఘోరాలూ, నేరాలూ చేయిస్తూ ఉంటుంది. హింస కూడా చేయిస్తుంది, ఘోరమైన జీవ హింస కూడా చేయిస్తూ ఉంటుంది. ఇవన్నీ చేయించేది మనసే ఆత్మకు సంబంధం లేదు.

మరి ఇవన్నీ మనసే చేయిస్తుంది కాబట్టి వాటి వల్ల వచ్చే ఫలితం, కష్టాలు ఏవీ కూడా ఆత్మకు సంబంధం లేదు. చేయించేది మనసే, ఆ నరకం అనుభవించేదీ మనసే. శరీరానికి యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. అది ఆత్మకేమి సంబంధం లేదు. ఒక మూడు నెలలు నరకం అనుభవిస్తాడు, ఆత్మకేంటి సంబంధం!

ఆ బాధ శరీరానికి ఉండదా అంటే! ఏ బాధైనా సరే శరీరానిది కాదు, మనసుదే. మీరు గమనిస్తే తెలుస్తుంది అంతా మనసుదే అని. నువ్వు క్లాసు వింటున్నావు ఆ సబ్జెక్టు మీద బాగా లీనమైపోయావు, మనసు దాని మీదే ఉండిపోయింది. ఇంక దేని మీదా దాని దృష్టి మళ్ళదు, అలా గంట అయినా, రెండు గంటలయినా మూడు గంటలయినా! అంత సమయం అయిందన్న సంగతి మీకు తెలీదు. మనసు దృష్టి అంతా దాని మీదే ఉంది. మధ్యలో మళ్లీ మనసు స్పృహలోకి వచ్చి ఆకలి మీదకి వెళ్తే అప్పుడు ఆకలి

వేస్తుంది. అప్పుడు ఏదో తినాలనుకుంటుంది.

అందుకే మీరు చూడండి. ఏ డాక్టర్ అయినా ఇంజెక్షన్ చేసేటప్పుడు వాళ్ళని కబుర్లలో పెడతాడు. చిన్న పిల్లలు అయితే ఏం చదువుతున్నావమ్మా అని అడుగుతాడు. ఏదో ఎస్.ఎస్.సి.నో, పి.యూ.సీ.నో, బి.ఎస్.సి.నో ఏదో చెప్తారు. ఏ సబ్జెక్టు తీసుకున్నావమ్మా? నీకు ఏ ర్యాంక్ వస్తుంది? అని అడుగుతూ ఉంటాడు. వీళ్ళు దానిలో లీనమైపోయి దృష్టి ఆ చదువు మీదకి వెళ్లి, మనసు ఆ విషయాలన్నీ స్ఫురణకు తెచ్చుకుంటూ అవి చెప్తూ ఉంటే, ఈ లోపల డాక్టర్ ఇంజెక్షన్ అయిపోయిందిలే వెళ్ళిరా అంటాడు.

కానీ కొంతమంది తెలివైనోళ్ళు ఉంటారు. వాళ్ళు ఏం చేస్తారంటే డాక్టర్ కబుర్లలో పెట్టి పొడిచేద్దాం అనుకుంటున్నాడు అని డాక్టర్ ఎన్ని మాట్లాడినా, ప్రశ్నలు అడిగినా దృష్టి వాటి మీద పెట్టకుండా పొడవడం మీదే పెడతారు. అందుచేత పొడిచినప్పుడు విపరీతమైన నొప్పి వల్ల గంతులు వేసేస్తారు, అందుచేత శరీరానికి కూడా ఏమీ బాధ ఉండదు, మనసుకే బాధ అంతా అని తెలుసుకోవాలి.

చంటి పిల్లలకి తల్లి ఎత్తుకొని అన్నం తినిపిస్తూ ఉంటుంది. ఆ పిల్లకి అమ్మ పెట్టేది నచ్చకపోతే వద్దు అంటుంది. అప్పుడు తల్లి ఏదో ఒక కథ చెప్తుంది. ఆ కథ చెప్తున్నంతసేపు ఆ చిన్న పిల్ల మనసు కథ మీదకి వెళ్ళిపోతుంది.

ఆవిడ కథ చెప్తూ ఉంటే ఆ బిడ్డ ఊ..ఊ.. అని వింటూ ఆ అన్నం తినేస్తుంది. మళ్లీ కథ ఆపేస్తే ఇంక నేను తినను అంటుంది. అంటే అక్కడ తింటున్నది శరీరం కాదు మనసు. అలా శరీరం కానీ, ఇంద్రియాలు కానీ ఏ పని చేసినా కారణం మనసే, దానితో ఆత్మకేమీ సంబంధం లేదు.

అలాగే యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది, హాస్పిటల్లో జాయిన్ చేశారు, డాక్టర్ గారు గదిలో కట్టు కట్టి పడుకోబెట్టారు. వాడు అమ్మోయ్

బాబోయ్ అంటూ ఉంటాడు. దగ్గర వాళ్ళు వచ్చి ఎలా జరిగింది రా అంటే అప్పుడు ఏదో కారు రాంగ్ డైరెక్షన్ లో స్పీడ్ గా వచ్చింది. నేను ప్రక్కగావెళ్ళినా వచ్చి గుద్దేసాడు అని చెప్తూ ఉంటాడు.

అలా రెండు నిమిషాలో, ఐదు నిమిషాలో అలా  చెప్తున్నంతసేపు మనసు చెప్పడం మీద ఉంటుంది కాబట్టి ఆ నొప్పి వాడికి తెలీదు. కానీ చెప్పడం అయిపోయిన వెంటనే మళ్లీ ఆ కాలు మీద చెయ్యేసి అమ్మోయ్, బాబోయ్ అంటాడు. ఆ కాసేపు ఎందుకు అమ్మోయ్, బాబోయ్ అనలేదు? కారణం మనసు చెప్పడం మీదకి మళ్ళింది కాబట్టి.

అందుచేత అనుభవించేది మనసే, అన్నీ చేయించేది మనసే! అక్కడ ఆత్మకి ఏమీ సంబంధం లేదు. ఆ కోళ్ళని తినమని, ఆ మేకలను తినమని వాటిని చంపమని ఆత్మ ఏమీ చెప్పదు. మనసు చేస్తుంది అంతే! ఇవన్నీ మనసు చేసే పనులు.

విద్యుచ్ఛక్తిని ఉపయోగించుకొని మానవుడు ఈ పరికరాలన్నిటిని పని చేయిస్తున్నాడు కానీ విద్యుచ్ఛక్తికి ఏమీ సంబంధం లేదు. ఫ్యాన్ వేసుకోవాలని విద్యుచ్ఛక్తి అనుకోదు, ఏసి వేసుకోవాలని విద్యుచ్ఛక్తి అనుకోదు. మానవుడే అనుకుంటున్నాడు. ఆ స్విచ్ వేస్తున్నాడు, ఆ ఏసీని అనుభవిస్తున్నాడు. ఆ కోడిని తినాలని ఆత్మ అనుకోదు, మనసు అనుకుంటుంది, తింటున్నాడు. ఆ కర్మ ఫలితం మళ్లీ అనుభవించేది కూడా మనసే.

చాలామంది అనుకుంటారు. ఆత్మ ఉంటేనే కదా పనులన్నీ జరుగుతున్నాయి. మరి కష్టాలు ఆత్మకు ఉండవా? అని. ఆత్మకు ఎందుకు ఉంటాయి? ఆత్మకు సంబంధం ఏంటి? ఆత్మ శక్తిని ఉపయోగించి మనసు ఇవన్నీ చేస్తుంది, అనుభవిస్తుంది.

ఈ తప్పులూ, పాపాలూ మనసే చేస్తుంది. దాని వల్ల వచ్చే కష్టాలు మళ్ళీ మనసే అనుభవిస్తుంది. అందుచేత అన్నిటికీ కారణం మనసే.

ఉపనిషత్తులో కూడా ఇదే చెప్పిబడింది.

**"మనుష్యాణాం మనయేవ కారణం... బంధ, మోక్షం"** అని.

అంటే బంధము అంటే దుఃఖానికి, మోక్షము అంటే ఆనందానికి మనసే కారణం అని ఉపనిషత్తులో స్పష్టంగా చెప్పబడింది, ఆత్మకేం సంబంధం లేదు.

అందుకే యోగులు ఈ మనసే ఈ పనులు చేయడానికి, ఈ దుఃఖాలకు కారణం కాబట్టి, ఆ మనసు మలినంగా ఉండబట్టే ఈ పనులు చేస్తుంది కాబట్టి ముందు మనసును శుద్ధి చేసుకోండి అంటారు. ఎప్పుడైతే మీరు మనసును శుద్ధి చేసుకుంటారో ఇంక ఆ తప్పుడు పనులు, సృష్టి విరుద్ధమైన పనులు చేయరు, అప్పుడు కష్టాలు రావు.

ఈ మనసే ఇవన్నిటికీ కారణం కాబట్టి యోగులు, ఋషులు మానవుడిలో ఉన్న ఆ మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించమంటారు. పత్రి గారు కూడా "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తేనే మెల్లి మెల్లిగా మీ మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గిపోతూ ఉంటుంది అన్నారు.

"శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చెయ్యడం వల్ల ముందు మనసు చంచలత్వం నుండి నిశ్చలత్వంలోకి వస్తుంది. ఇంకా చేస్తూ ఉంటే నిశ్చలమైన మనసు నిర్మలం అవుతుంది అంటే శుద్ధి అవుతుంది. ఇంకా మానకుండా తీవ్రంగా చేస్తూ ఉంటే నిర్మలమైన మనసు శూన్యం అవుతూ ఉంటుంది, అంటే దాని యొక్క ఉనికి కోల్పోతూ ఉంటుంది.

ఏ మనసు అయితే ఇప్పటిదాకా నీ చేత ఇన్ని పనులు చేయించిందో అది ఒక స్టేజ్ వచ్చేసరికి ఇంక అక్కడ ఉండదు. అప్పుడు అక్కడ ఉండేది ఆత్మ, శరీరమే. అప్పుడు ఈ శరీరం ఆత్మ వల్లే పనిచేస్తూ ఉంటుంది. ఆత్మ అంటే భగవంతుడు కాబట్టి, సృష్టి చేసింది ఆయనే కాబట్టి, ఆయనకి అన్నీ తెలుసు కాబట్టి చేయకూడని పనులు ఏమీ చేయడు. ఇంక వారికి కష్టాలు

రావు. వాళ్ళు అలా ఆత్మ స్థితి పొందారు కాబట్టి వారు భూమి మీదకి రారు అంటే జన్మలు ఉండవు.

అలా మనసును జయించినటువంటి  యోగీశ్వరులే ఒక జీసస్ అయినా! కృష్ణుడైనా! రాముడైనా !

జీసస్‌ని మేకులతో కొట్టినా, సిలువ వేసినా ఆయనేమి ఏడవలేదు, మామూలుగానే మాట్లాడాడు.

రమణ మహర్షికి క్యాన్సర్ వస్తే అసలు దాన్ని పట్టించుకోలేదు, మామూలుగానే ఆయన పని ఆయన చూసుకున్నాడు. ఇలా మనసుని జయించి శూన్యం చేసుకున్న వాళ్ళు మాధవులు అయ్యారు.

అందుచేత మనసును శూన్యం చేయాలి అంటే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం వల్లనే సాధ్యం. చాలామంది గైడింగ్లు, మ్యూజిక్లు పెట్టుకొని మనసు దగ్గర ఆగిపోతున్నారు. ఇంక అదేం శూన్యం అవుతుంది, ఆత్మ దగ్గరికి చేరితేనే మనసు శూన్యమై ఆత్మ మిగులుతుంది. మనసు దగ్గర ఆగిపోతే వాళ్ళు ఈ జన్మ కాదు కదా ఇంకొక 100 జన్మలు ఎత్తినా మానవుడిగానే ప్రవర్తిస్తారు.

అందుచేత గుర్తుపెట్టుకోండి. ఆత్మ ఉన్నా, ఆత్మ వల్ల ఈ పనులన్నీ జరుగుతున్నా ఆ పనులకీ, ఆత్మకీ సంబంధం లేదు. ఇవన్నీ చేయించేదంతా మనసే. ఆ పనుల వల్ల వచ్చే కష్టాలు, బాధలు, సమస్యలు అనుభవించేది కూడా మనసే. ఇది విన్న వాళ్ళు మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించుకునే ప్రయత్నం చేస్తారు. మాధవ లక్షణాలు, అంటే దైవ లక్షణాలు  సంపాదించు కుంటారు. దైవమని పిలువబడతారు.

# ధనం కంటే గొప్పవి, విలువైనవి మానవునకు ఇవ్వబడ్డాయి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలి?

ధనం కంటే గొప్పది, విలువైనది ముఖ్యంగా సమయం. అంతేకాదు వాక్కు అంటే మాట్లాడే శక్తి, దానితోపాటు పని చేసే శక్తి, చూసే శక్తి, వినే శక్తి.

వీటి విలువ మానవులు గుర్తించడం లేదు, గొప్పతనం తెలుసు కోవడం లేదు. ఎంతసేపు డబ్బే గొప్పది అనుకుంటారు. కానీ వీటిని సరైన విధంగా ఉపయోగిస్తే, సామాన్య మానవుడు కూడా గొప్పవాడైన మాధవుడుగా ఎదగ గలుగుతాడు.

కానీ మానవులు వీటిని మూడు రకాలుగా ఉపయోగించుకుంటున్నారు. కొంతమంది సద్వినియోగ చేస్తున్నారు. కొంతమంది నిర్వినియోగం చేస్తున్నారు ఇంకా కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు.

ఎవరు చేసిన దానికి తగ్గ ఫలితం వారు పొందుతున్నారు. సద్వినియోగం చేస్తే జీవితంలో మంచి ఫలితాలు పొందుతారు, జీవితంలో ఆశ్చర్యం గొలిపే విజయాలు సాధిస్తారు. చివరకు సృష్టిలోనే గొప్పవాడైన దైవంగా మారతారు.

అలాగే నిర్వినియోగం చేస్తే ఇచ్చిన వాటిని వృధా చేసుకుంటారు, జీవితాన్ని వ్యర్థం చేసుకుంటారు. దుర్వినియోగం చేస్తే నష్టపోతారు, జీవితాన్ని కష్టాలపాలు చేసుకుంటారు, ఉన్నవి కూడా కోల్పోతారు.

# దుఃఖం వల్ల లాభాలు

"బండ, దెబ్బలు తింటేనే బట్టలోని మురికి పోయి, బట్ట శుభ్ర పడుతుంది.  అలాగే ఉలి దెబ్బలు తింటేనే రాయి అందమైన శిల్పంగా మారుతుంది."

"అలాగే మానవుడు  దుఃఖం అంటే కష్టాలు పడితేనే మాధవుడుగా అవుతాడు."

అలా ఏ మానవుని చూసినా వారు జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించిన వారే, కష్టాలు పడిన వారే. గమనిస్తే లోకంలో కష్టాలు పడినవారే గొప్పవారిగా ఎదిగారు.

సినిమాల్లో చూడండి, మొదట ఎన్నో కష్టాలు పడి  సాధనలు చేస్తేనే వారు గొప్ప హీరోలుగా తయారయ్యారు. అలాగే ఆటల్లో చూసినా, సినిమాల్లో చూసినా, రాజకీయాల్లో చూసినా, చదువుల్లో చూసినా బాగా కష్ట పడిన వారే గొప్పగా ఎదగడం జరిగింది. ఏ కష్టం పడని వారు జీవితంలో అలాగే ఉండి పోయారు.

అందుచేత ఏ విద్యలో చూసినా కష్ట పడిన వారే రాణించ గలుగుతున్నారు, మంచి పేరు తెచ్చుకో గలుగుతున్నారు. అందుకే పెద్దలు కష్టే  ఫలి అన్నారు. అందుచేత దుఃఖం లాభమని తెలుసుకోవాలి. అందుచేత కష్టాల్లోనే అంటే దుఃఖం లోనే లాభం ఉంది అని  తెలుసుకోవాలి.

పత్రి గారు కూడా చెబుతూ ఉంటారు. నేను ఎన్నో జన్మలు కష్టపడి ధ్యాన సాధన చేయడం వల్లే ఇప్పుడు ఈ స్థితికి ఎదిగి ఇంతమందికి దారి చూపించ గలుగుతున్నాను అన్నారు.

దుఃఖం వల్ల కలిగే కొన్ని లాభాలు తెలుసుకుందాం.

1. దుఃఖంవల్ల కష్టాలు తట్టుకునే శక్తి పెరుగుతుంది.

2. దుఃఖంవల్ల గర్వం, అహంకారం తగ్గుతాయి.

3. దుఃఖం వల్ల నీ శక్తి, సామర్థ్యాలు పెరగడమేకాదు, నిరూపించుకునే అవకాశం కలుగుతుంది.

4. దుఃఖం నుంచి జీవితంలో అనుభవాలు పొందుతారు.

5. దుఃఖంవల్ల అనుభవం పెరుగుతుంది. అంటే చేసిన పాపాలు దుఃఖం రూపంలో అనుభవిస్తూ అనుభవాలు పొందుతారు. అందుకే రాధా స్వామి వారు ఏమన్నారంటే? **"ఏ ఏ కర్మలు చేస్తావో ఆయా అనుభవాలు పొందవలసి ఉంటుంది."** అన్నారు. ముష్టివాళ్ళు, ముసలివారు, కుష్ఠురోగులు, గుడ్డివారు, అంగ వైకల్యాలు కలవారు, మానసిక వికలాంగులు భూమికి భారంకాదు, అనుభవాలు పొంది భవిష్యత్ జన్మలలో సేవలు చేస్తారు.

6. దుఃఖంనుండి అనుభవాలు పొంది పాఠాలు నేర్చు కుంటారు. జీవితాన్ని సరిచేసుకుంటారు. పాఠాలు నేర్చుకునే కొద్దీ అనుభవ జ్ఞానం పెరుగుతుంది. ఇక ఆ రకమైన పాప కర్మలు చెయ్యరు. అందుచేత ఈ అనుభవ జ్ఞానం పెరిగేకొద్దీ అరకమైన కర్మలు దగ్ధమవుతాయి. కర్మలు తగ్గేకొద్దీ దుఃఖం తగ్గుతుంది, ఆనందం పెరుగుతుంది. ఆత్మ ఎదుగుతుంది. అందుచేత దుఃఖం కలుగుతేనే దుఃఖం పోతుందని తెలుసు కోవాలి.

అందుకే శ్రీకృష్ణుల వారు కర్మలు చెయ్యడం మానవద్దు అన్నారు.

**శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచనా**
**మా కర్మఫల హేతుర్భుర్మాతే సఙోస్త్వ కర్మణి (భ.గీ.2-47)**

తా:- అర్జునా నీకు కర్మను చేయుట యందే అధికారము కలదు కానీ, కర్మఫలం ఆశించుట యందు నీకు అధికారం లేదు. కర్మఫలమునకు నీవు కారణభూతుడవు కారాదు. మరియు కర్మలు మానుట యందు కూడా ఆసక్తి చూపించకూడదు.

7. దుఃఖం వల్ల భగవంతుడు గుర్తుకు వస్తాడు. ముందు దుఃఖం

తొలగించ మని ఆరాధనలు చేస్తారు. ఆధ్యాత్మిక గ్రంధాలు పారాయణ చేస్తారు. కానుకలు ఇస్తారు, మొక్కులు చెల్లించుకుంటారు.

ఇన్ని చేసినా దుఃఖం పోకపోయేసరికి, ఏమిటి? నేను ఎన్నిచేస్తున్నా దేవుడు నన్ను పట్టించుకోవట్లేదు? ఎందుకు పట్టించుకోవట్లేదు? అని అనుకుంటూ అసలు తాను చేసిన తప్పేమిటి? పాపమేమిటి? అని ఆలోచిస్తారు. మెల్లిగా తాము చేసింది తప్పులని తెలుసుకుంటారు. ఆయన అలా సాక్షీ భూతంగా చూస్తూవుంటే? అలాంటి తప్పులు ఇక చేయనని చెప్పుకుంటారు. తప్పులు చేయడం మానేస్తారు. అలా తమకు తాము పరివర్తన చెందుతారు.

అలా దుఃఖం వల్ల తనలో తాను అంతర్మథనంలో పడతాడు. అసలు నేను ఏమి తప్పులు చేశాను? ఎం పాపాలు చేశాను? నా వల్ల ఎవరికి నష్టం కలిగించాను? అని ఆత్మ పరిశీలన చేసుకొని, తన తప్పులు తెలుసుకొని, అక్కడనుండి తప్పులు చేయకుండా జాగ్రత్త పడతాడు. తనకు తెలియకుండానే తనలో ఎంతో మార్పు తెచ్చుకుంటాడు, ఇదంతా దుఃఖం వల్లనే జరుగుతుంది.

8. అంతేకాదు ఎంతోమంది గురువులను పెద్దలను కలుసు కుంటారు. వారి సందేశాలు వింటూ ఉంటారు, వారి ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. మెల్లిగా భగవంతుడి గురించి తెలుసుకోగలుగుతారు. భగవంతుడు ఎవరు? ఎక్కడ ఉంటాడు? అన్నవి తెలుసుకుని భగవంతుడిని పొందే మార్గం, తెలుసుకునే ప్రయత్నం చేస్తారు.

9. అలా దుఃఖం పోవడానికి రకరకాల ప్రయత్నం చేస్తూ, చివరకు ధ్యాన మార్గంలోకి వస్తాడు. అక్కడ తెలుసుకుంటాడు. విగ్రహం దేవుడుకాదు, ఆత్మే దేవుడుఅని. ఆయన తన దేహంలోనే వున్నాడు అని తెలుసుకుంటారు.

10. పర్ణశాలలో పోయిన సూది బైట వెతుకుతే ఎలా దొరకదో! అలా తనలో ఉన్న దైవాన్ని బైట వెతుకుతే దొరకదని బుద్ధుడు లాంటి వారు

చెప్పిన విషయాలు తెలుసుకుంటారు. అలాగే వేమన కూడా చెప్పారు.

**తనలో సర్వంబుండగా తన లోపల వెదుక లేక**
**ధర వెతికెడి ఈ తనువుల మోసెడి**
**ఎద్దుల మనమంబు తెలుపగ వశమే**
**విశ్వదాభి రామ వినుర వేమ**

తా:- తనలో సమస్తము ఉండగా, తన లోపల వెతుకకుండా భూమి అంతా వెతికె ఈ శరీరాలు మోసే ఎద్దులు గురించి ఎవరు చెప్పగలరు? అని వేమన చెప్పడం జరిగింది.

10. భగవంతుని పొందాలంటే ధ్యానం చెయ్యాలని తెలుసుకుని ధ్యానం ప్రారంభిస్తాడు. చివరకు తీవ్ర ధ్యానం చెయ్యడం వల్ల దేవుడ్ని పొంది సమస్త దుఃఖాలనుండి బైట పడతాడు. అందుచేత దుఃఖం లాభమే కానీ నష్టం కాదు.

11. అందుకే కుంతి ఎప్పుడూ దుఃఖంలో ఉండేటట్లు చూడు అని శ్రీకృష్ణుడుతో అంది. అప్పుడే నువ్వు మా పాండవుల దగ్గర ఎప్పుడూ ఉంటావు అంది.

12. అంతేకాదు దుఃఖం వల్ల మరొక సత్యం తెలుసుకుంటాడు. దేవుడు అంటే ఆత్మ ఎవరో కాదు తానే అని. "అహం బ్రహ్మోస్మి" అని తెలుసుకుంటాడు. ఇదంతా దుఃఖం వల్ల వచ్చిన లాభమే.

13. అసలు భూమిమీదకు వచ్చిందే ఈలాభాలన్నింటి కోసం.

14. అలా దుఃఖం వల్ల తాము ఆత్మ అని తెలుసుకోవడమేకాదు. తాముపై లోకాలనుండి వచ్చిన ఆత్మలమని తెలుసుకుంటారు. దేనికోసమంటే? ఆత్మ ఎదుగుదలకు, ఆత్మ ఉన్నత లోకాలు చేరుకోవడానికని తెలుసుకుంటారు.

15. అంతేకాదు జీవితంలో కలిగే అపజయాల వల్ల కలిగే దుఃఖం తన అంటే ఆత్మ ఎదుగుదలకు ఉపయోగ పడుతుందని తెలుసుకుంటారు.

అంటే  కష్టాలవల్ల అనుభవాలు పొందుతామని. అనుభవాలవల్ల పాఠాలు నేర్చుకుంటామని. అలా పాఠాలు నేర్చుకోవడం వల్ల జ్ఞానం పెరుగుతుందని తెలుసుకుంటారు.

అటువంటి  జ్ఞానాన్ని అనుభవ జ్ఞానం అంటారు. అటువంటి జ్ఞానం వల్ల కర్మలు దగ్ధం అవుతాయి, కష్టాలు పోతాయి. ఇదంతా దుఃఖంవల్ల కలిగిన లాభమే. అందుకే పత్రీజీ "గతం అవగతమైతే విగతం అవుతుంది" అంటారు.

అంతేకాదు జ్ఞానం వల్ల ఆత్మ ఎదుగుతుంది. ఉన్నతలోకాలు చేరుకుంటారు. అలా ఆత్మ ఎదగడం వల్ల జీవిత లక్ష్యం సాధిస్తారు. అందువల్ల  శాశ్వతంగా దుఃఖం లేని స్థితి పొందుతారు.  అంతేకాదు ఈస్థితి రావదానికి కష్టపడి ధ్యానం చేస్తారు. అలా  ఇన్నిరకాలుగా కష్టపడితే కానీ కష్టాలలోనుండి బైటపడలేరు. అందుకే ' కష్టే ఫలి ' అన్నారు.

16.అందుచేత జీవితంలో కష్టాలు పడితే కాని, కష్టాలలోంచి బైట పడలేము. కష్టాలన్నవి కష్టాలు లేకుండా చేసుకోవడానికే! అందుచేత దుఃఖం అన్నది మన మంచికే! లాభానికే అని తెలుసుకోవాలి.

17. ఈ విషయమే ముండకోపనిషత్తులో చెప్పబడింది.

**"ద్వాసుపర్ణా సయూజా సఖాయా**
**సమానం వృక్షం పరిష స్వజాతే**
**తయోరణ్యం పిప్పలం స్వాద్యత్తి**
**అనష్టినన్ అన్యో అభిచాగత్యతి."**

తా:- ఒక చెట్టు పై కొమ్మ మీద ఒక్క పక్షి, క్రింద కొమ్మ మీద ఇంకొక పక్షి వున్నాయి. రెండూ ఒకే రకంగా ఉన్నాయి. కానీ పై పక్షి ప్రశాంతంగా ఉంది.

క్రింది పక్షి చేదు ఫలాలను తిన్నపుడు దుఃఖపడుతూ పైకి చూస్తూ పై కొమ్మ మీదకు వెళ్తూ వుంటుంది. మధుర ఫలాలు తిన్నప్పుడు క్రిందకు చూస్తుంది. అలా చేదు ఫలాలు తింటూ పైపైకి వెళ్తూ ఆ పైపక్షిని చేరుతుంది.

రెండూ ఒకటే అని తెలుసుకుంటుంది.

ఇక్కడ పైపక్షి అంటే పూర్ణాత్మ. క్రింద పక్షి అంటే పూర్ణాత్మ నుండి విడివడిన అంశాత్మ. ఈ అంశాత్మ భూమి మీదకు వచ్చి, శరీరం తీసుకుని జీవాత్మ అయింది. అంశాత్మ కష్టాలు, సుఖాలు అనుభవిస్తూ ఉంటుంది. సుఖాలు అనుభవించినప్పుడు బాగానే ఉంటుంది ఉంది కానీ కష్టాలు అనుభవించినప్పుడు ఎన్నో పాఠాలు నేర్చుకుంటుంది, జ్ఞానాన్ని పెంచు కుంటుంది. అలా అలా పై లోకాలలో పైపైకి వెళ్తుంది. చివరకు పూర్ణాత్మను చేరుకొని అది వేరు, నేను వేరు కాదు, ఇద్దరు ఒకటే అని తెలుసుకుని మోక్షాన్ని పొందుతుంది. అలా జీవాత్మ దుఃఖం పొందడం ద్వారా దుఃఖం లేని స్థితికి చేరుకుంటుంది.

18. అందుచేత అపజయాలు ఉన్నవాడు నష్టపోయినట్టు కాదు, తక్కువ కాదు. విజయాలు పొందినవాడు లాభం పొందినట్టు కాదు, ఎక్కువ కాదు.

19. అందుకే అంటారు "IF THERE IS NO PAIN, THERE IS NO GAIN." నొప్పులు లేకుండా పురుడు రాదు కదా? అలాగే కష్టాలు పడకుండా ఆత్మ పురోగతి ఉండదు. అందుకే అంటారు కష్టాలు పడితేనే కష్టాలు లేకుండా చేసుకుంటారు. అందుచేత ఏ రకంగా చూసినా దుఃఖం లాభమే!

20. అందుకే ఆత్మకు అంటే మనకు కష్టాలవల్ల పురోగమనమే కాని తిరోగమనం ఉండదు అంటారు పత్రిగారు. ఆయన ఇంకా అన్నీ గొప్ప జన్మలే కాని, హీన జన్మలు, నీచ జన్మలు ఉండవు అంటారు పత్రీజీ.

జీవితంలో ఆత్మ పూర్ణాత్మ కావాలంటే కష్టాలతో అన్నిరకాల అనుభవాలు పొందాలి, అన్నీ నేర్చుకోవాలి. మానవ జన్మలలో ఇది తప్పనిసరి. అందుకే మానవ జన్మలో ప్రవేశించిన అంశాత్మ పూర్ణాత్మ కావాలంటే సుమారు 400, లేక 500 జన్మలు తీసుకోవలసి ఉంటుందని పత్రీజీ చెపుతారు.

అందుచేత దుఃఖం లాభమే కానీ నష్టం కాదు దుఖానికి బాధపడవలసిన పని లేదు.

# స్మశానంలో చివరగా ఆత్మ తెలుసుకునే చేదు నిజాలు

పూర్వం ఒక అందమైన ఆశ్రమం ఉండేది అందులో ఒక గురువు కొంతమంది శిష్యులు ఉండేవారు. ఆ గురువు గొప్ప తపః శక్తి సంపన్నుడు చాలా గొప్పవాడు. ఆ గురువు వద్ద శిష్యుడిగా చేరడానికి చాలా మంది వచ్చేవారు. అలా వచ్చిన వారిలో కొంతమందిని గురువుగారు నేరుగా ఆశ్రమంలోకి చేర్చుకునేవారు.

మరి కొంతమందిని మాత్రం మీరు ఒక రోజు రాత్రి స్మశానంలో గడిపి రండి అప్పుడే మిమ్మల్ని ఆశ్రమంలో చేర్చుకుంటాను అని చెప్పేవాడు. ఇలా కాలం గడుస్తూ ఉండగా ఒక రోజున ఒక వ్యక్తి ఆశ్రమం ముందుకు వచ్చి గురువుగారు మీరు నన్ను మీ శిష్యునిగా చేర్చుకోండి అని అడుగుతాడు.

ఆ గురువు నాయనా నువ్వు నా శిష్యునిగా ఉండాలంటే ఒకరోజు పూర్తిగా స్మశానంలోనే గడపాలి. అలా నువ్వు అక్కడ ఏది చూసినా దాని నుండి నువ్వు ఏమి తెలుసుకున్నా మరుసటి రోజు వచ్చి నాకు వివరించాలి. అలా చేస్తేనే నేను నిన్ను నా ఆశ్రమంలో చేర్చుకుంటాను అని అంటాడు. అది విన్న అతను ఆశ్చర్యపోయాడు గురువుగారు మధ్యాహ్నం అయితే పర్వాలేదు కానీ రాత్రి సమయంలో స్మశానంలో ఉండడం మంచిది కాదు అని అంటాడు.

ఆ గురువు ఎందుకు మంచిది కాదు అక్కడ రాత్రి ఏం జరుగుతుంది? అని అడుగుతాడు. అప్పుడు ఆ శిష్యుడు గురువుగారు రాత్రి సమయంలో స్మశానంలో భూత, ప్రేతాలు ఉంటాయి. అవి నన్ను ఏమైనా చేయవచ్చు. అప్పుడు గురువుగారు నాయనా మరి నువ్వు ఎప్పుడైనా భూత, ప్రేతాలను చూశావా? అని అడిగితే శిష్యుడు లేదు, చూడలేదు అన్నాడు. కానీ

కొంతమందికి భూతాలు ఆవహిస్తాయి, దయ్యాలు పట్టుకుంటాయి అని నేను విన్నాను. ఆ సమయంలో వారు వింత వింతగా ప్రవర్తిస్తారు అని నేను విన్నాను అన్నాడు.

అప్పుడు ఆ గురువుగారు నాయనా ఇవన్నీ కూడా నువ్వు విన్నవి మాత్రమే కదా! మరి వాటి గురించి పూర్తిగా తెలుసుకోవాలి కదా! అందువల్ల నువ్వు ఒక్క పగలు ఒక్క రాత్రి అక్కడే ఉండిచూడు అన్నాడు. ఆ తరువాత భూత ప్రేతాలు ఉన్నాయా? లేవా? అనేది నువ్వే వచ్చి చెప్పు. ఒకవేళ నీకే గనుక ఆ భూతం కనబడితే వాటిని అడిగి వాటి వివరాలు తెలుసుకో అవి ఎలా ఉంటాయి? అవి ఏమి తింటున్నాయి? అనేది తెలుసుకో! ఒకవేళ నీకే గనుక అవి కనబడకపోతే నీకు తెలుస్తుంది కదా భూత ప్రేతాలు లేవని, అందువల్ల నువ్వు మాత్రం భయపడకు అక్కడ ఏమి జరిగినా మరిసటి రోజు వచ్చి నాకు చెప్పు, నీ ప్రాణాలకు మాత్రం ఏ హాని జరగదు ధైర్యంగా వెళ్ళు అని అంటాడు.

అప్పుడు ఆ వ్యక్తి సరే గురువుగారు మీరు చెప్పినట్టుగానే నేను ఒకరోజు పగలు, రాత్రి స్మశానంలో గడుపుతాను అని అంటాడు. అప్పుడు ఆ గురువు సరే నాయనా ఈ రోజు రాత్రికి ఇక్కడే ఉండి రేపు ఉదయాన్నే స్మశానానికి బయలుదేరు అని అంటాడు. ఆ తరువాత గురువుగారు కొంతమంది శిష్యులను పిలిచి మీరు అతని వెనకాలే స్మశానానికి వెళ్ళండి. అతను ఏం చేస్తున్నాడో గమనించండి. కానీ మీరు అతని వెనకాల ఉన్నట్టుగా అతనికి తెలియకూడదు అని అంటాడు.

ఆ మరుసటి రోజు ఉదయాన్నే ఆ వ్యక్తి గురువు వద్దకు వెళ్లి గురువుగారు నేను మీరు చెప్పినట్టుగానే స్మశానానికి వెళ్తున్నాను అని అంటాడు. గురువుగారు సరే నాయనా వెళ్ళు అని అంటాడు. ఆ వ్యక్తి స్మశానానికి చేరుకున్నాడు. అతని వెనకాలే అతనికి తెలియకుండా కొంతమంది శిష్యులు

కూడా స్మశానానికి చేరుకొని దూరం నుండి అతనిని గమనిస్తున్నారు. అలా ఆ వ్యక్తి ఒక రోజు మొత్తం అక్కడే గడిపి మరుసటి రోజు ఆశ్రమానికి చేరుకున్నాడు.

అప్పుడు ఆ గురువుగారు అతడిని చూసి ఒక నవ్వు నవ్వి నాయనా నువ్వు పూర్తిగా ఒకరోజు మొత్తం స్మశానంలోనే గడిపావు కదా నువ్వు ఏం చూశావు? దాని నుండి నువ్వు ఏం నేర్చుకున్నావు? ఏం తెలుసుకున్నావో నాకు చెప్పు అని అంటాడు. అప్పుడు ఆ శిష్యుడు గురువుగారు నేను ప్రొద్దున్నే అక్కడికి చేరుకున్నాను. నేను వెళ్ళిన కొద్దిసేపటికే కొంతమంది ఒక శవాన్ని మోసుకు వస్తున్నారు. కొంతమంది మాత్రమే ఆ శవయాత్రలో ఉన్నారు. వారిలో కొంతమంది ఏడుస్తున్నారు. మరి కొంతమంది ఇతను చాలా అదృష్టవంతుడు. ఇతనికి మంచి చావు వచ్చింది, బ్రతికి ఉన్నప్పుడు చాలా మంచి పనులు చేశాడు అని అనుకుంటున్నారు. ఇలా శవాన్ని చితిపై ఉంచి కుమారుడు చితిని అంటించి కొద్దిసేపు అక్కడే ఉన్నాడు.

అలా కొద్దిసేపటి తర్వాత ఒక్కొక్కరుగా అందరూ అక్కడి నుండి వెళ్ళిపోయారు. చివరికి చితికి నిప్పు పెట్టిన కొడుకు కూడా వెళ్ళిపోయాడు. ఆ తరువాత కొద్దిసేపటికే మళ్ళీ రెండు శవయాత్రలు వచ్చాయి. అందులో ఒక శవం ధనవంతులది, దీనిని అందంగా ముస్తాబు చేసి తీసుకు వస్తున్నారు, దాని వెనకాల చాలా మంది వస్తున్నారు.

ఇంకోటి పేదవానిది దీనిని సాదా సీదాగా తీసుకు వస్తున్నారు. ఈ శవయాత్రలో చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారు. ధనవంతుని చితిని గంధం చెక్కలతో పేర్చారు. ఇక పేదవాడిది సాధారణ కర్రలతో పేర్చారు. ముందుగా ధనవంతుని చితిని కాల్చారు, ఆ తరువాత పేదవాని చితిని కాల్చారు. ఆ రెండు చితులు కాలుతున్నాయి. ఆ తరువాత అందరూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.

కానీ నేను మాత్రం అక్కడే ఉండి కాలుతున్న రెండు శవాలను దీర్ఘంగా చూస్తున్నాను. అప్పుడు ఆ గురువు నాయనా మరి వాటిని చూసి నువ్వు ఏం తెలుసుకున్నావు అని అడుగుతాడు. అప్పుడు ఆ వ్యక్తి గురువుగారు రెండు చితులు సమానంగానే ఉన్నాయి. ఇద్దరి శరీరాలు ఒకే రకంగా కాలుతున్నాయి. ఆ తరువాత కొద్దిసేపటికే ఇద్దరూ పూర్తిగా కాలిపోయారు. అలా కాలిన తర్వాత మిగిలిన ఇద్దరి బూడిద కూడా ఒకే రకంగా ఉంది. అందులో వేరే తేడా ఏమీ లేదు అన్నాడు.

ఆ తరువాత కొద్ది సేపటికే ఒక స్త్రీ యొక్క శవాన్ని తీసుకు వచ్చారు. ఆ స్త్రీ యొక్క భర్త చాలా బాధపడుతున్నాడు. అక్కడికి వచ్చిన వారందరూ కూడా చాలా దుఃఖిస్తున్నారు. అందరూ ఆ స్త్రీ యొక్క భర్తను ఓదారుస్తున్నారు. అందులో కొంతమంది జ్ఞానవంతులు కూడా ఉన్నారు. వారు ఇలా అంటున్నారు, అందరూ కూడా ఏదో ఒక రోజున ఇక్కడికి రావలసిందే జీవితాన్ని ధర్మబద్ధంగా పరోపకారంగా జీవించాలి, ఎవ్వరికీ ఎప్పుడూ కష్టం కలిగించవద్దు, ధనంపై వ్యామోహం పెంచుకోకూడదు, అంతిమంగా అందరూ స్మశానంలోకి రావలసిందే అంటూ అందరూ అక్కడ నుండి వెళ్ళిపోయారు.

ఆ తరువాత ఎవ్వరూ రాలేదు. నేను రాత్రి మొత్తం అక్కడే ఉండి మరుసటి రోజున మీ ముందుకు వచ్చాను అని అంటాడు. అప్పుడు ఆ గురువుగారు నాయనా మరి నీకు అక్కడ భూత ప్రేతాలు దయ్యాలు లాంటివి ఏమైనా కనిపించాయా? అన్నారు  గురువుగారు. అప్పుడు ఆ వ్యక్తి లేదు కనబడలేదు, నాకైతే అక్కడ ఏ భూత ప్రేతాలు కనబడలేదు. ఆ రాత్రి మొత్తం నాలో నేనే భయపడ్డాను, అక్కడి ఆకుల చప్పుడుకు భయపడ్డాను, జంతువులు చేసే శబ్దాలతో భయపడ్డాను కానీ వేరే ఏ భూత ప్రేతాలు నాకు కనబడలేదు అని అంటాడు.

ఆ గురువు సరే ఈరోజు ఆశ్రమంలోనే విశ్రాంతి తీసుకొని మళ్ళీ రేపు ఉదయాన్నే స్మశానానికి వెళ్ళు ఒక్క పగలు ఒక్క రాత్రి అక్కడే గడిపిరా అని అంటాడు. అప్పుడు ఆ వ్యక్తి గురువుగారు మీరు ఏమంటున్నారు? మీరు చెప్పారనే కదా ఒకరోజు మొత్తం నేను స్మశానంలోనే గడిపాను. నాకు ఎంత కష్టంగా ఉందో నాకే తెలుసు నేను మళ్ళీ అక్కడికి వెళ్ళను అని అంటాడు.

ఆ గురువుగారు నాయనా నువ్వు ఏదైతే అతి ముఖ్యమైన విషయాన్ని తెలుసుకోవాలో దానిని నువ్వు ఇంకా తెలుసుకోలేదు. మళ్ళీ ఒకరోజు అక్కడే ఉండు ఈసారి అది నీకు తప్పకుండా తెలుస్తుంది అని అంటాడు.

ఆ వ్యక్తి సరే అని చెప్పి ఆ రోజు ఆశ్రమంలోనే విశ్రాంతి తీసుకొని మరుసటి రోజు ఉదయాన్నే గురువుగారి పాదాలకు నమస్కరించి స్మశానానికి వెళ్ళాడు. ఆ వ్యక్తి పూర్తిగా ఒక రోజు మొత్తం స్మశానంలోనే గడిపి మరుసటి రోజు గురువుగారి ముందుకు వచ్చి నిలుచున్నాడు. అలా నిలుచున్న ఆ వ్యక్తి కళ్ళల్లో ఏదో తెలుసుకున్నాను అనే ఆనందం గురువుగారికి కనబడింది.

గురువుగారు నాయనా నువ్వు దేనికోసం అయితే అక్కడికి వెళ్ళావో దానిని పూర్తిగా తెలుసుకున్నావా? అని అడుగుతాడు. అప్పుడు ఆ వ్యక్తి ఆ తెలుసుకున్నాను అని అంటాడు. మరి నువ్వు ఎం తెలుసుకున్నావో చెప్పు అని అంటాడు.

అప్పుడు ఆ వ్యక్తి నిర్మలమైన మనసుతో గురువుగారు సాయంత్రం సమయంలో నన్ను పాడె మీద పడుకోబెట్టుకొని స్మశానానికి తీసుకువస్తున్నారు.

నా వెనకాలే ఒక 15 మంది నడుస్తున్నారు. నన్ను నలుగురు సమానంగా భుజాలపై మోస్తున్నారు, నా తండ్రి నా ముందు నడుస్తున్నాడు. కొంతమంది నాపైన పువ్వులు చల్లుతున్నారు, కొంతమంది బంధువులు నా వెనకాలే నడుస్తున్నారు, అందరూ చాలా దుఃఖిస్తున్నారు. అందరికంటే నా తండ్రి నా తమ్ముడు ఎక్కువగా దుఃఖిస్తున్నారు. అంతమందిలో కొందరు ఎంతో

దుఃఖిస్తున్నట్టుగా నటిస్తున్నారు, కొంతమంది మా నాన్నను ఓదారుస్తున్నారు. దూరంగా నిలుచున్న నా తమ్ముడు ఎంతో దుఃఖిస్తున్నాడు, కొంతమంది నా తమ్ముని వద్దకు వెళ్లి నాయనా ఇక నువ్వే ఈ ఆస్తి మొత్తానికి ఏకైక వారసుడివి అని చెబుతున్నారు. మరి కొంతమంది అయ్యో ఇలా జరిగి ఉండకూడదు, చాలా చిన్న వయసులోనే మరణించాడు, ఇంకా జీవితంలో అతను ఏమీ అనుభవించలేదు అని అంటున్నారు.

ఆ తరువాత నాకు అన్ని రకాలుగా చేయవలసిన క్రియలన్నీ పూర్తి చేశారు. ఇవన్నీ కూడా నేను పాడె మీద పడుకొని చూస్తూనే ఉన్నాను. నేను ఆ పాడె మీద నుండి లేవడానికి చాలా ప్రయత్నించాను, కానీ లేవలేక పోయాను. నేను శ్వాస తీసుకోవడానికి చాలా ప్రయత్నిస్తున్నాను, కానీ తీసుకోలేక పోతున్నాను. ఎందుకంటే నాలో ఊపిరి లేదు, నేను నా తండ్రిని పట్టుకొని గట్టిగా గుండెలకు హత్తు కోవాలనుకున్నాను, కానీ నేను లేవలేక పోయాను. నా తమ్మునితో మాట్లాడాలనుకున్నాను, తల్లిదండ్రులను బాగా చూసుకోమని చెబుదాం అనుకున్నాను, కానీ నేను ఏది చేయలేకపోతున్నాను.

ఆ తరువాత నన్ను చితిపై ఉంచి నాపైన కర్రలు ఉంచారు, నా మొహాన్ని కూడా మూసివేశారు, ఇక నాకు బయట ఏమీ కనిపించడం లేదు. నాకు లోపల చాలా బాధ కలుగుతుంది, కొద్ది సేపటికే నాకు వేడి తగలడం మొదలయ్యింది, ఆ తరువాత నాకు అర్థమైంది, నన్ను కాలుస్తున్నారు, కాళ్ళు చేతులు కాలిపోతున్నాయి, ఎముకలు కాలుతున్నాయి మెల్లి మెల్లిగా అగ్ని ఎక్కువగా మండుతుంది. ఆ మంటల్లోంచి నేను తప్పించుకోవడానికి చాలా ప్రయత్నిస్తున్నాను, నా శక్తినంతా కూడగట్టుకొని ప్రయత్నించినా చూస్తూ ఉండడమే తప్ప నా వల్ల ఏమీ చేత కావడం లేదు. ఇక చివరికి నేను అగ్నిలో పూర్తిగా కాలిపోయాను.

నేను ఆ పూర్తి రాత్రి కాలుతున్న నన్ను నేనే చూసుకుంటున్నాను. ఇక చివరికి నాకు అంతిమ రూపంగా కేవలం బూడిద మాత్రమే మిగిలింది. ఎంతో అందమైన నా శరీరం ఈరోజు ఒంటరిగా ఒక స్మశానంలో బూడిదగా మారిపోయింది. అలా ఆ బూడిదను చూస్తూనే ఆ రాత్రి గడిచిపోయింది. నాకు ఆ రాత్రి ఏ భయం వేయలేదు ఇక ఉదయాన్నే మీ ముందుకు వచ్చాను అని అంటాడు.

ఆ గురువు ఒక నవ్వు నవ్వి నాయనా ఇప్పుడు నా శిష్యుడిగా ఉండే అర్హతను సాధించావు. నువ్వు ఏదైతే తెలుసుకోవాలని నేను కోరుకున్నానో దానిని నువ్వు పూర్తిగా తెలుసుకున్నావు. నాయనా ఒక్కటి మాత్రం జీవితంలో బాగా గుర్తుంచుకో

'జీవితంలో ఏది శాశ్వతం కాదు చివరికి ఏది మిగలదు' అని నువ్వు తెలుసుకున్నావు. ఈ లోకంలో స్మశానానికి వెళ్ళిన ప్రతి వ్యక్తి ఇక్కడికి రావలసిందే ఏది శాశ్వతం కాదు అని తెలుసుకుంటారు.

కానీ స్మశానం నుండి బయటకు రాగానే అన్ని మరిచిపోతారు. మళ్ళీ ఇంతకుముందు ఎలా జీవించారో అలాగే జీవిస్తారు. వారిలో ఎలాంటి మార్పు ఉండదు, చెడు పనులే చేస్తారు అధర్మంగానే ఉంటారు, ధనం కోసం ఎన్నో తప్పుడు పనులు చేస్తారు. కానీ స్మశానంలోకి వెళ్ళగానే అన్ని మరిచిపోయి ఎంతో ధర్మాత్ములలాగా నీతి వాక్యాలు మాట్లాడుతారు. నాయనా నువ్వు మొదటిసారి స్మశానానికి వెళ్ళినప్పుడు నువ్వు కూడా అలాగే ఉన్నావు కానీ నువ్వు రెండవసారి వెళ్ళినప్పుడు మాత్రం మనసుతో నీ జీవితాన్ని నువ్వు చూసుకున్నావు.మనం అనుభవించే అన్ని సుఖాలు, దుఃఖాలు ఏవీ కూడా శాశ్వతం కాదు, అని నువ్వు తెలుసుకున్నావు ప్రతి మానవుడు ఇది తెలుసుకోవాలి. ఎవరి జీవితమైనా మంచి చెడు అనే మాటతోనే ముగుస్తుంది. అందుకే నువ్వు వేటి మీద ఆశలు పెంచుకోకుండా ధర్మబద్ధంగా జీవితాన్ని గడుపు అని చెప్పాడు ఆ గురువు.

# తేటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | |
|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - రూ.130/- |
| 4) సత్యమార్గం | - రూ.160/- |
| 5) ధ్యాన శక్తి | - రూ.130/- |
| 6) ధ్యాన శాస్త్రం | - రూ.130/- |
| 7) ఆత్మ శాస్త్రం | - రూ.120/- |
| 8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | -రూ.160/- |
| 9) మరణించకముందే మరణించాలి | - రూ.130/- |
| 10) జీవిత సూక్ష్మాలు | - రూ.130/- |
| 11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - రూ.120/- |
| 12) గీతాసందేశం | - రూ.120/- |
| 13) ఉపమాన ధ్యాన సందేశాలు | -రూ.110/- |
| 14) భగవంతుడంటే | - రూ.100/- |
| 15) తెలుసుకోండి | - రూ.100/- |
| 16) మెహర్‌బాబా సందేశాలు | - రూ.100/- |
| 17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు | - రూ.100/- |
| 18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? | - రూ.100/- |
| 19) కోరికల వల్ల నష్టాలు | - రూ.100/- |
| 20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు | - రూ.100 |
| 21) కఠోపనిషత్తు | - రూ.90/- |
| 22) ఉపమాన జ్ఞాన సందేశాలు | -రూ.90/- |
| 23) కర్మ సిద్ధాంతం | - రూ.80/- |
| 24) ధ్యానమంటే ? | - రూ.80/- |
| 25) త్రివిధాలు | - రూ.80/- |
| 26) ఉత్తమ పురుషుడు | - రూ.80/- |
| 27) శాస్త్రాల అర్థం-అంతరార్థం | - రూ.70/- |
| 28) ఆత్మజ్ఞానం ఎందుకు? | - రూ.70/- |
| 29) జ్ఞాన జ్యోతి | - రూ.70/- |
| 30) జ్ఞాన కుసుమాలు | - రూ.70/- |
| 31) మరణం తర్వాత కూడా వచ్చేవి | - రూ.70/- |
| 32) షిరిడీ సాయి సందేశాలు | - రూ.70/- |
| 33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - రూ.70/- |
| 34) బుద్ధుని సందేశాలు | - రూ.70/- |
| 35) భూతదయే దైవత్వం | - రూ.70/- |
| 36) ఆత్మహంతకులంటే ఎవరు? | - రూ.70/- |
| 37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి | - రూ.70/- |
| 38) ధర్మ సూక్ష్మాలు | - రూ.70/- |
| 39) ఆశ్చర్యకరమైన విషయాలు | -రూ.70/- |
| 40) మానవునిలోని చెడు | -రూ.70/- |
| 41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు | -రూ.70/- |
| 42) దుఃఖ నివారణామార్గం | - రూ.60/- |
| 43) బ్రహ్మజ్ఞానం | - రూ.60/- |
| 44) ధ్యానం (పత్రీజీ) | - రూ.60/- |
| 45) ధ్యానం వల్లనే జ్ఞానం | - రూ.60/- |
| 46) అతీంద్రియ శక్తులు | - రూ.60/- |
| 47) ఆలోచించండి | - రూ.60/- |
| 48) నిర్వాణ మార్గం | - రూ.60/- |
| 49) ధ్యానులకు సూచనలు | - రూ.60/- |
| 50) యోగీశ్వరుల సందేశాలు | - రూ.60/- |
| 51) మాస్టర్‌గా ఎదగాలంటే? | -రూ.50/- |
| 52) భగవంతుని ఇష్టులవ్వాలంటే | -రూ.50/- |
| 53) సంకల్పమంటే? | - రూ.50/- |
| 54) ఈ జీవితం ఎందుకు? | - రూ.50/- |
| 55) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - రూ.50/- |
| 56) మూడురకాల భవిష్యత్తులు | -రూ.50/- |
| 57) అరిహంత్ | - రూ.50/- |
| 58) మూడురకాల జీవితాలు | -రూ.40/- |
| 59) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - రూ.40/- |
| 60) ఛాంపియన్ అవ్వాలంటే? | -రూ.40/- |
| 61) బ్రహ్మం అంటే? | -రూ.40/- |
| 62) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం | -రూ.40/- |
| 63) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం | -రూ.40/- |
| 64) మహాత్ముల సందేశాలు | - రూ.40/- |
| 65) సత్యం | - రూ.40/- |
| 66) చక్రాలు | - రూ.40/- |
| 67) గురువును గుర్తించడం ఎలా? | - రూ.40/- |
| 68) భాగవత సన్నివేశాల అంతరార్థం | - రూ.40/- |
| 69) మౌన ధ్యానం | - రూ.40/- |
| 70) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | -రూ.20/- |
| 71) శాకాహారమే మానవాహారం | - రూ.15/- |
| 72) అహింస మరియు శాఖాహారం | - రూ.15/- |



అరిహంత్ అంటే శత్రువును హతం చేసినవాడు అంటే అంతం చేసినవాడు. మానవుడికి ముగ్గురు శత్రువులు ఉన్నారు. ఎవరు అంటే తమోగుణం, రజోగుణం, సాత్విక గుణం.

ఎంత కృషి చేసి ఆ లక్షణాలు తగ్గించుకుంటే మీకు అన్ని జన్మలు తగ్గిపోతాయి. ఇప్పుడు నేను మీ అందరికీ ఎందుకు చెప్తున్నానంటే ప్రారంభ జన్మలో ఉన్నవాళ్ళు అంటే 100, 150, 200 జన్మల్లో ఉన్నవాళ్ళు అలా ప్రవర్తిస్తే ప్రవర్తించొచ్చు. కానీ మీరందరూ కూడా 350 జన్మలు దాటి ఉన్నవాళ్లే. మీరు ఈ లక్షణాన్ని సమూలంగా తొలగించుకోవాలి.

ఎవరైతే ఈ విధంగా మూడు శత్రువులను సంపూర్ణంగా జయిస్తారో వారే అరిహంత్ అని పత్రీగారు చెప్పడం జరిగింది.

**- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**

రూ.70/-